

'కామధేను'లో 115 పశువుల వేలం




కొండాపురం, జూలై 31: చింతలదీవి కామధేను పునరుత్పత్తి కేంద్రంలో బుధవారం పశువుల వేలం జరిగింది. మొత్తం 182 పశువులకు వేలం నిర్వహించగా 66 ఆవులు, 49 గేదెలను రైతులు దక్కించుకున్నారు. సమయాభావం కావడంతో మరోసారి వేలం నిర్వహిస్తామని ఆ కేంద్రం జేడీ వెంకటేష్ తెలిపారు. ఈ వేలంలో పశుసంవర్థక శాఖ కావలి డివిజన్ అసిస్టెంటు డైరెక్టర్ మంగేశ్వరరావు, సీఎల్ఎఫ్ డీడీ పెద్దస్వామి, ఏడీలు రామన్, దేవరాజ్, శైలజ పాల్గొన్నారు.



సరస్వతీ నిలయాల్లో
పదవుల పోరు

- నేటి నుంచి ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ
- నేడు నోటిఫికేషన్ విడుదల, 8న ఓటింగ్
- వైసీపీ హయాంలో ఏకపక్ష ధోరణి
- అనుచరులనే చైర్మన్ చేయాలని ఆదేశాలు
- 2,295 పాఠశాలలో కమిటీల ఏకగ్రీవం
- ఎన్డీయే హయాంలోనైనా సజావుగా సాగేనా!?



పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయడానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించింది. గత వైసీపీ ప్రభుత్వం పేరెంట్ మానటరింగ్ కమిటీ పేరుతో నిర్వహించిన ఎన్నికలను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలుగా మార్పు చేసింది. ఈ మేరకు ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి నాడు-నేడు, తల్లికి వందనం, విద్యాకానుకలతోపాటు తదితర అంశాలను ఈ కమిటీ పర్యవేక్షించేలా ఆదేశాలు జారీచేసింది. గురువారం నోటిఫికేషన్ విడుదల చేసి, ఓటర్ల జాబితాలను ప్రకటించనున్నారు. అయితే గత ప్రభుత్వంలో ఈ ఎన్నికలు ఏకపక్షంగా వైసీపీ నేతల కనుసన్నల్లో జరగ్గా ఎన్డీఏ ప్రభుత్వంలోనైనా ఈ ఎన్నికలు సజావుగా జరుగుతాయా లేదా పాత పద్ధతిలోనే జరుగుతాయా అన్న సందిగ్ధత అందరిలో నెలకొంది.

నెల్లూరు (విద్య), జూలై 31: జిల్లాలో గతంలో 2,688 ప్రాథమిక, 361 ప్రాథమికోన్నత, 418 ఉన్నత పాఠశాలలు మొత్తం 3,467 బడులు ఉండగా వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం 117తో పలు పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో 2,595 పాఠశాలలు నడుస్తున్నాయి. గతంలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో వైసీపీ నేతల ప్రోద్బలం, తమకు నచ్చిన వారిని ఎంపిక చేసుకోవడంతో 2,295 పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవంగా ఎంపికయ్యాయి. ప్రస్తుతం గడువు ముగియడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి రెండేళ్ల కాలపరిమితికి జరిగే ఎన్నికలకు ఎస్ఎస్ఏ, జిల్లా విద్యాశాఖలు కలిసి సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రతి పాఠశాలలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు. వారి వివరాలతో కూడిన జాబితాను పాఠశాలతోపాటు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనూ ప్రదర్శిస్తారు. విడులైన షెడ్యూల్ ప్రకారం తల్లిదండ్రుల అభ్యంతరాలను కూడా స్వీకరించి చేతులెత్తే పద్ధతి ద్వారా ఎన్నికలు జరపనున్నారు.

ఎన్నికల షెడ్యూలు ఇలా..

విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 1వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి ఓటర్ల జాబితాలను ప్రకటిస్తారు. 5వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటర్ల జాబి తాలపై అభ్యంతరా లను స్వీకరిస్తారు. అదే రోజు సాయం త్రం 3 నుంచి 4 గంటల మధ్య తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు పరిష్క రించి ఫైనల్ జాబితా విడుదల చేస్తారు. 8వ తేదీ ఉదయం 7 నుంచి 1 గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. 3 నుంచి 4 గంటల సమయంలో ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి తొలి సమావేశం నిర్వహిస్తారు.

సజావుగా నిర్వహిస్తాం

ఎస్ఎంసీ ఎన్నికలను జిల్లాలో సజావుగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల్లో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా తల్లి దండ్రులే ఎన్నికల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నాము. పునర్నిర్మాణ ప్రక్రియలో అంతరాయం కలిగినా, కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాము. అవసరమైన ప్రాంతాల్లో కలెక్టర్ అనుమతితో పోలీసుల పర్యవేక్షణలో ఎన్నికలు జరుపుతాము.

- ఉషారాణి, ఎస్ఎస్ఏ ఏపీసీ

సజావుగా జరిగేనా!?

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఈసారైనా సజావుగా జరిగేనా అన్న సందే హాలు అందరిలో నెలకొన్నాయి. గతంలో పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ పాలకవర్గాల గడువు ముగియడంతో ఎన్నికలు నిర్వహించ కుండా పాతవారి పదవీకాలనే పొడగించారు. వైసీపీ హయంలో అధికార పార్టీకి చెందిన నేతలు తమ వర్గానికి చెందిన వారే చైర్మన్, సభ్యులుగా ఉండేందుకు పోటీపడ్డారు. పాఠశాలల్లో అభివృద్ధి పనులకు రూ.లక్షల్లో నిధులు మంజూరు కావడం, వీటిని కమిటీల ఆధ్వర్యంలోనే నిర్వహిస్తుండటంతో నాడు అందరి దృష్టి ఈ ఎన్నికలపై పడింది. దీంతో స్కూళ్లపై ఆధిపత్యం చెలాయిం చేందుకు రాజకీయ నేతలు సన్నద్ధమ య్యారు. ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితాను తమకు అంద చేయాలని, తాము కూడా కోఆప్షన్ సభ్యులే నంటూ హెచ్ఎంలతో వాగ్వి వాదాలకు దిగారు. తమ అనుచరులనే చైర్మన్‌లుగా చేయాలన్న లక్ష్యంతో చేసిన ప్రయత్నాలు పలు ప్రాంతాల్లో వివాదాలకు దారి తీశాయి. దీంతో గతంలో 2,295 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. వెయ్యి పాఠశాలల్లో మాత్రం ఎన్ని కలు నిర్వహించి సభ్యులను ఎన్నుకున్నారు. వివాదాలు, ఆరోపణల నేపథ్యంలో మరో 172 పాఠశాలల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. ఏకగ్రీవమైన పాఠశాలల్లో తమకు నచ్చిన వారిని తరగతికి ముగ్గురు చొప్పున గరిష్ఠంగా 23 మందిని ఎంపిక చేసి మరో ఐదుగురు కోఆప్షన్ సభ్యులను నియమించారు. ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికల్లో కూడా మార్పులు వస్తాయని తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విధుల నుంచి టీచరు తొలగింపు

మర్రిపాడు : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్ర భుత్వ ఉపాధ్యాయుడిని శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తూ డీఈవో రామారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మర్రిపాడు మండలం పల్లిపాడు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పెమ్మసాని శ్రీనివాసులు ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి వెంట తిరుగుతూ ఆత్మకూరు మండలం రావులకొళ్లు గ్రామంలో ప్రచారంలో పాల్గొన్నారు. అంతేగాక పోలింగ్ రోజున ఏజెంట్‌గా కూడా వ్యవహరించ డంతో టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించి ఆయన్ను శాశ్వతంగా విధుల నుంచి తొలగించారు.

ఆలయాలకు ఇన్‌చార్జి ఈవోల నియామకం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 31: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సస్పెండ్ అయిన ఐదుగురు ఈవోల స్థానంలో ఆయా ఆలయాలకు ఇన్‌చార్జి ఈవోలుగా ఇన్‌స్పెక్టర్లను నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వింజమూరు మండలం నల్లగొండ, గృహమల్లేశ్వర స్వామి ఆలయం, నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం, నార్తుమోపూరు గ్రూపు దేవాలయాలకు ఇన్‌చార్జి ఈవోగా ఆర్కే చైతన్యను నియమించారు. వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, దేవరపాలెం ఆలయాలను నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్, తమ్మినపట్నం కోదండరామస్వామి ఆలయం, సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయాలకు గూడూరు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును నియమించారు.

యథాస్థానాలకు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్లు

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్లుగా పనిచేస్తున్న కొందరు సబ్ రిజిస్ట్రార్లను యథాస్థానాల్లో నియమిస్తూ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. కోవూరులో ఉన్న చంద్రశేఖర్‌రెడ్డిని యథాస్థానం బుచ్చిరెడ్డిపాళెంకు, బుచ్చిలో ఉన్న కోటేశ్వరమ్మను ఆమె యథాస్థానం ఆత్మకూరుకు బదిలీ చేశారు. అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జీవీఎస్ ప్రసాద్‌ను కోవూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న మిల్కి రోషన్‌ను స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇన్‌చార్జిగా నియమించారు. ఇక్కడున్న ఉన్నం శ్రీనివాసులును ఈయన యథాస్థానం వెంకటగిరికి బదిలీ చేశారు.

విద్యుత్ శాఖ ఈఈల బదిలీ

నెల్లూరు (జడ్పీ) : విద్యుత్ శాఖ నగర ఈఈ సోమశేఖర్‌రెడ్డిని రూరల్ డివిజన్ ఈఈగా బదిలీ చేస్తూ సీఎండీ ఉత్వర్వులను జారీ చేశారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే నగర డీఈగా పని చేస్తున్న శ్రీధర్‌కు ఈఈగా పదోన్నతి కల్పించారు.

మున్సిపాలిటీలకు మంచిరోజులు!

- రూ.1.7 కోట్ల బీపీఎస్ నిధులు విడుదల
- ఎన్డీయే ప్రభుత్వంలో దక్కిన వాటా
- కాలువల్లో పూడికతీతకు వాడాలని ఆదేశాలు




నెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలకు మంచి రోజులొచ్చాయి. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు అందక కనీసం కాలువల్లో పూడిక కూడా తీసుకోలేని దయనీయస్థితిలోకి మున్సిపాలిటీలు జారుకున్నాయి. అయితే తాజాగా ఎన్డీయే ప్రభుత్వం మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేసింది. చాలా కాలం నుంచి బిల్డింగ్ పీనలైజ్ స్కీం (బీపీఎస్) కింద వచ్చిన నిధుల్లో మున్సిపాలిటీలకు వాటా జమ కావడం లేదు. ప్రభుత్వమే ఆ నిధులన్నీ వాడుసుకుంటూ వచ్చింది. ఇటీవల రాష్ట్రస్థాయిలో మున్సిపాలిటీల పనితీరుపై సమీక్షించిన మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి బీపీఎస్ వాటా విషయాన్ని తీసుకెళ్లారు. రానున్నది వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాలువల్లో పూడిక తీయాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. అయితే, అందుకు నిధుల కొరత ఉందని అధికారులు తెలియజేయడంతో వెంటనే మున్సిపాలిటీలకు అందాల్సిన బీపీఎస్ వాటాను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలోని నెల్లూరు కార్పొరేషన్ మినహా నాలుగు మున్సిపాలిటీలకు రూ.1.7 కోట్ల నిధులు జమ అయ్యాయి. కావలికి రూ.73 లక్షలు, ఆత్మకూరుకు రూ.23 లక్షలు, బుచ్చికి రూ.29 లక్షలు, కందుకూరుకు రూ.45 లక్షల చొప్పున నిధులు ఆయా మున్సిపాలిటీల ఖాతాల్లో చేరాయి. ఈ నిధులతో మొదటి ప్రాధాన్యతగా కాలువల్లో పూడిక తీయనున్నారు. మున్సిపాలిటీల్లో చాలా కాలం నుంచి కాలువల్లో పూడిక తీయకపోవడంతో ఎక్కడికక్కడ బ్లాక్ అయి పోయాయి. దీని మూలంగా వర్షపు నీరు, మురుగు బయటకు వెళ్లడం లేదు. అది ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలగజేస్తోంది. సీజనల్ వ్యాధులకు ఇదే ప్రధాన కారణంగా మారుతోంది. తాజాగా నిధులు రావడంతో ఆయా మున్సిపాలిటీల అధికారులు కాలువల్లో పూడికతీతకు ప్రతిపాదనలు రూపొందిస్తు న్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలుపెడతామని ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు తెలియజేశారు.

జిల్లాలో పలువురు డీఎస్పీల బదిలీ

- నెల్లూరు రూరల్‌కు 'ఘటమనేని'
- స్పెషల్ బ్రాంచ్‌కి శ్రీనివాసరావు


ఘటమనేని శ్రీనివాసరావు


అత్తిన శ్రీనివాసరావు

నెల్లూరు (క్రైం) : రాష్ట్రవ్యా ప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరు మాలరావు బుధవారం ఉత్తర్వు లు జారీ చేశారు. అందులో భాగంగా డీజీ కార్యాలయం అటాచ్‌లో ఉన్న నెల్లూరు రూరల్ డీఎస్పీ పి వీరాంజనేయరెడ్డిని ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని సూచించారు. ఆయన స్థానంలో తిరుపతి పీటీసీలో పనిచేస్తున్న ఘటమనేని శ్రీనివాసరావును నియమించారు. ఈయన గతంలో కృష్ణపట్నం పోర్టు సీఐగా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. ఇక నెల్లూరు ట్రాఫిక్ డీఎస్పీ అర్ల శ్రీనివాసులును అనంతపురం జిల్లా పెనుకొండకు, నెల్లూరు సీసీఎస్ డీఎస్పీ పి రామకృష్ణాచారిని తిరుపతి ట్రాఫిక్‌కు, నెల్లూరు రైల్వే డీఎస్పీగా ఉన్న సీహెచ్ విజయ భాస్కర్‌రావును పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు డీఎస్పీ అత్తిన శ్రీనివాస రావును నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమితులయ్యారు.

పలువురు సీఐలు కూడా..

జిల్లాలో సీఐల బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు మహిళా పీఎస్-2లో పని చేస్తున్న సుబ్బారావు, అజయ్‌కుమార్‌లను ఒంగోలు తాలూకా పీఎస్‌కు, ఒంగోలు సీసీఎస్‌లో ఉన్న విజయ్‌కృష్ణను రాపూరు సర్కిల్‌కు, నెల్లూరు సీసీఎస్‌లో ఉన్న సీహెచ్ కోటేశ్వరరావును నెల్లూరులోని చిన్నబజారు స్టేషన్‌కు, చిన్నబజారులో ఉన్న అశోక్‌కుమార్‌ను రేంజ్ వీఆర్‌కు, కలిగిరిలో ఉన్న ఎండీ ఫిరోజ్‌ను రేంజ్ వీఆర్‌కు, వేదాయపాళెంలో ఉన్న వెంకటనారాయణను కలిగిరికి బదిలీ చేశారు.

ఆర్నెల్లుగా అద్దె లేదు!

- జిల్లాలో 412 హెల్త్‌క్లినిక్‌లు బాడుగ భవనాల్లోనే..
- సుమారు రూ.49.44 లక్షల బకాయిలు
- కొన్నిచోట్ల అద్దెలు చెల్లిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు
- గత 6 నెలలుగా బకాయిల కోసం నిరీక్షణ
- ఎప్పుడు వస్తాయో చెప్పలేని వైద్యాధికారులు

నెల్లూరు (వైద్యం), జూలై 31 : వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రజానీకానికి మెరుగైన వైద్య సేవలు అందుతాయంటూ గత ప్రభుత్వం ఊదరగొట్టింది. అయితే ఇక్కడ నియమించిన వైద్య ఉద్యోగుల సమస్యలు మాత్రం గాలికి వదిలేసింది. ఫలితంగా ఆయా విలేజ్ క్లినిక్ భవనాల అద్దెలు కూడా కొంతమంది ఉద్యోగులు తమ జీతాల నుంచి చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. 2022, డిసెంబరులో జిల్లా వ్యాప్తంగా 495 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరవగా, కేవలం 75 ప్రభుత్వ భవనాలు పూర్తయి వాటిని వైద్య ఆరోగ్యశాఖకు అప్పగిం చారు. 412 హెల్త్‌క్లినిక్‌ల భవనాలు ఇంకా నిర్మాణంలోనే ఉండగా, 8 హెల్త్ క్లినిక్‌ల భవనాలు నిర్మాణానికే నోచుకోలేదు. ఈ నేపథ్యంలో 412 క్లినిక్‌లు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ) పేరుతో కాంట్రాక్టు ప్రాతిపదికన ఒక్కో క్లినిక్‌కు ఒకరిని నియమించారు. అద్దె భవనాల్లో నడుస్తున్న క్లినిక్‌లకు బాడుగ రూపేణా నెలకు రూ.2వేల నుంచి 3 వేల చెల్లిస్తున్నారు. ఆరంభం నుంచి అడపాదడపా అద్దె సొమ్ము విడుదల చేస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పూర్తిగా ఆపేసింది. అద్దెలు చెల్లించాలంటూ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో ఉద్యోగం ఉంటే చాలన్న భావనతో క్లినిక్‌లో ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ అద్దె భారం మోస్తున్నారు. తమకు వచ్చే రూ.25వేల వేతనం లోనే కొంత అద్దె బకాయిలు చెల్లిస్తున్నట్లు వాపోతున్నారు.

రూ.49.44 లక్షలు చెల్లించాలి..

ప్రతి నెల హెల్త్ క్లినిక్‌లకు అద్దెల రూపంలో రూ.8.24 లక్షలు విడుదల చేయాల్సి ఉండగా, ఆరు నెలల బకాయిలు రూ.49.44 లక్షలకుపైగా చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అద్దె నిధులు విడుదల చేయక పోవటంతో ఈ భారం కూడా కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వంపైనే పడుతుంది.

రవాణా చార్జీలూ భరించాల్సిందే

క్లినిక్‌లో ఉండే ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి నెల ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయానికి వచ్చి 42 రకాల మందులు తీసుకు వెళ్లాల్సి వస్తుంది. సీతారామపురం, దుత్తలూరు, ఉదయగిరి, దుత్తలూరు వంటి దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి చేరుకుని ఆటోలలో ఈ మందులు తీసుకు వెళ్లాలి. పరిస్థితుల్లో రవాణా చార్జీల రూపేణా దగ్గర ప్రాంతాలకు రూ.2వేలు, దూర ప్రాంతాలకు రూ.5వేలు ఖర్చవుతోంది. ఈ ఖర్చులు జాతీయ ఆరోగ్య మిషన్ భరించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు లేవు. అసలు మందులను ఎన్‌హెచ్ఎం ప్రత్యేక వాహనాలలో ఆయా ఆరోగ్య కేంద్రాలకు చేర్చాల్సి ఉన్నా ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్లినిక్‌ల అద్దెతోపాటు రవాణా చార్జీలు చెల్లించాలని ఎంఎల్‌హెచ్‌పీలు కోరుతున్నారు.



దొంగలను పట్టే జీపు ఇదేనా !?


ఆ జీపులోనే పెట్రోలింగ్ విధులు


అరె.. డీజిల్ ట్యాంకుకు మూత ఏది!?



నవాబుపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న జీపు

ఈ పోలీస్ జీపును చూశారా!? ఇదేదో మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్‌లో ఉందని అనుకుంటే మీరు పొరబడ్డట్టే!. నెల్లూరు నగరంలోని నవాబుపేట స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు వాడుతున్న వాహనం ఇది. జీపు ముందు లైట్లు లేకుండా, అక్కడక్కడా తుప్పపట్టి, విరిగిన కమ్ములకు తాళ్లు కట్టి వాడుతున్నారు. కనీసం డీజిల్ ట్యాంకుకు మూత కూడా లేదు. మొండికే కేరాఫ్‌గా మారుతున్న ఈ జీపును అతికష్టమ్మీద వాడుతున్నట్టు పోలీసులే చెబుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ఏది నిజం?

నరసాపురంలో సంచలనం రేకెత్తించిన తాకట్టు బంగారం కేసులో ఎన్నో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. ఉషారాణి తాకట్టు పెట్టింది.. బంగారమా..? లేదా నకిలీదా..? వ్యాపారి వాటిని మార్చాడా..? లేదా ఇంకా ఏమైనా కొత్త ట్విస్టులు ఉన్నాయా? ఈ కేసులో ఇలా అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి...

బంగారమే తాకట్టు పెట్టా... ఉషారాణి

కాదు.. నకిలీ బంగారం అంటున్న జైన్

మోసం చేశారంటూ పరస్పర కేసులు

అన్ని కోణాల్లో పోలీసుల విచారణ



నరసాపురంలోని తాకట్టు నగల దుకాణం

నరసాపురం, జూలై 31: నకిలీ బంగారం కేసు పోలీసులకు ఛాలెంజ్ గా మారింది. ఇద్దరి ఫిర్యాదుల్ని స్వీకరించిన పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగు చూస్తోంది. నకిలీ బంగారం తాకట్టు పెట్టి మోసం చేసిం దని జేపీ బ్యాంకర్స్ అధినేత సుమేరామాల్ జైన్ ఆరోపిస్తుంటే తాను పెట్టింది అసలు బంగారమే అని వాటిని మార్చేసి తిరిగి చంపుతామని తమనే బెదిరిస్తున్నారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉషారాణి నెల్లూరులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాకట్టు వ్యాపారులు కస్టమర్లకు పెట్టిన వస్తువులకు రసీదులు ఇవ్వరన్న విషయం ఈ కేసుతో వెల్లడైంది. ఒక్క ఉషారాణి విషయంలో కాదు.. ఎవరూ పెట్టినా ఇదే పరిస్థితి. దీనివల్ల కస్టమర్లు కొన్ని సమయాల్లో మోసపోయే ప్రమాదం ఉంది. ఉషారాణి విషయంలో ఇదే జరిగింది. గడిచిన రెండేళ్లలో ఆమె దాదాపు 22 సార్లు వస్తువుల్ని తాకట్టు పెట్టింది. దీనికి ఎటువంటి రసీదు ఇవ్వలేదు. అయితే ఉషారాణి తాకట్టు పెట్టినప్పుడల్లా వస్తువుల బరువు చూసి తాకట్టు ఫారంలో ఆ వివరాలను నమోదు చేసి సంతకం కూడా పెట్టించారు. అయితే వస్తువుల్ని గీటు పెట్టకుండా అప్పు ఇవ్వ డమే పెద్ద మిస్టరీగా మారింది. ఉషారాణి స్వస్థలం నరసాపురం అయినప్పటికీ ఆమె కొంత కాలం నుంచి నెల్లూరులో ఉంటున్నారు. రాష్ట్రంలో నెల్లూరు బులియన్ వ్యాపారానికి పెట్టింది పేరు. అక్కడ తాకట్టు వ్యాపారాలు కూడా ఉన్నాయి. అక్కడ కాకుండా ప్రతిసారి నరసాపురంలోనే ఎందుకు తాకట్టు పెట్టారన్న సందేహం కూడా వ్యక్తమవు తోంది. ఈ నేపథ్యంలో ఉషారాణి కుటుంబ నేపథ్యం..ఆమెకు ఈ బంగారం పూర్వీకుల నుంచి వచ్చిందా ? లేదా కొన్నదా.. ? ఇతర ఆస్తిపస్తులు, తాకట్టు పెట్టినప్పుడల్లా వచ్చిన డబ్బును ఏం చేశారు ? ఏమైనా ఆస్తులు కొన్నారా ? తదితర కోణాల్లో పోలీసులు లోతైన విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తును పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. దుకాణంలోని సీసీ కెమెరాల ఫుటేజ్, తాకట్టు పెట్టినట్లు వ్యాపారి చూపిస్తున్న వస్తువుల్ని కూడా పరిశీలించారు. అన్ని స్టేట్‌మెంట్‌లు, కేసుకు సంబంధించిన అన్ని ప్రూఫ్‌లను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ స్వామి చెప్పారు.

కన్యకా పరమేశ్వరి ఆలయ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

● పూర్వ పాలక మండలి హౌస్ అరెస్టు


ప్రమాణ స్వీకారం సందర్భంగా నూతన కార్యవర్గం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 31: నగరంలోని స్టోన్ హౌస్‌పేటలో గల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ నూతన కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. కొత్త పాలక మండలితో నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ పాలక మండలికి గౌరవ సలహాదారుడు శేగు షణ్ముఖరావు మాట్లాడుతూ ఆలయం బైలా ప్రకారం కార్యవర్గాన్ని నియమించినట్లు చెప్పారు. ప్రవీణ్ శంకర్ గత పాలక మండలిలో గౌరవాధ్యక్షుడిగా వ్యవహరించిన నుడా మాజీ చైర్మన్ ముక్కాల ద్వార కానాథ్ వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని రాజకీయ కేంద్రంగా మార్చి ఆర్యవైశ్యులను చులకనగా చూశారని ఆరోపించారు. తాజా పాలక మండలి అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన కోట గురుబ్రహ్మం మాట్లాడుతూ తనకు తల్పగిరి రంగనాథస్వామి ఆలయం చైర్మన్‌గా, వాసవీ కల్యాణ మండపాల నిర్వహణ కమిటీలో పనిచేసిన అనుభవం ఉందని, ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కాగా, నూతన కమిటీలో ప్రధాన కార్యదర్శిగా నిచ్చెనమెట్ల చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా వేమూరు వెంకటప్రసాద్, జాయింట్ కార్యదర్శిగా మునగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఒమ్మిన జనార్థన్‌రావు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, నాయకుడు కువ్వారపు బాలాజీ, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, రంగనాథస్వామి ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, బాలాజీనగర్ సీతారామమందిరం చైర్మన్ గుప్తా, పొట్టిశ్రీరాములు వాణిజ్య మండలి అధ్యక్షుడు ఆక్పేటీ శేషయ్య తదితరులు అభినందనలు తెలిపారు. కాగా, ప్రమాణ స్వీకారం సందర్భంగా పూర్వ పాలక మండలి సభ్యులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముక్కాల ద్వారకానాథ్‌తోపాటు ఆయా నాయకుల ఇళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

సంగం, జూలై 31: జండాదిబ్బకు చెందిన ఎస్.రామయ్య (42) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు.. రెండేళ్లుగా బుచ్చిరెడ్డిపాలెంలో ఆటో నడుపుకుని జీవనం సాగించే ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల బాగా మద్యానికి బానిసైయ్యాడు. ఇంట్లో తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం బుచ్చిరెడ్డిపాలెంలోని ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. అప్పటి నుంచి తిరిగి వెళ్లలేదు. కుటుంబసభ్యులు ఆరా తీసినా కనిపించలేదు. ఈ నేపథ్యంలో జండాదిబ్బలోని సొంత ఇంటిలో దుర్వాసన రావడంతో పక్కింటివాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. రామయ్య ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. పోలీసులు.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న మృతి కేసులో ఏడేళ్లు కఠిన కారాగారం

నెల్లూరు (లీగల్), జూలై 31 : కట్టుకున్న భార్యను వరకట్నం కోసం వేధించి ఆమె మృతికి కారణమయ్యాడన్న కేసులో నేరం రుజువు కావడంతో షేక్ ఖాదర్ మస్తాన్ అనే నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నెల్లూరు జిల్లా 8వ అదనపు (ప్రత్యేక మహిళా కోర్టు) సెషన్స్ జడ్జి జీ గీత బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.... పొదలకూరు మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ మస్తాన్‌కు ఆత్మకూరు మండలం అశ్వనీపురం గ్రామానికి చెందిన షేక్ లాల్ బీబీ అలియాస్ లాల్‌బీ అలియాస్ అషాతో 2014 అక్టోబరు 25 తారీఖున వివాహం జరిగింది. పెళ్లి సమయంలో లాల్‌బీ తల్లిదండ్రులు లక్షా యాభై వేల రూపాయల కట్నం, అమ్మాయికి 12 సవర్ల బంగారం, గృహోపకరణాల కోసం లక్ష రూపాయలు ఇచ్చారు. డ్రైవర్‌గా పనిచేసే ఖాదర్ కొన్నాళ్లకు కువైట్ వెళ్లాడు. అక్కడి నుంచి వచ్చాక అదే గ్రామంలో ఓ మహిళతో చనువుగా ఉండేవాడు. ఈ విషయమై ఖాదర్ దంపతుల మధ్య గొడవ జరిగింది. ఖాదర్ మస్తాన్ తల్లిదండ్రులు షేక్ మాబున్నీసా, షేక్ రహంతుల్లా కూడా కుమారుడికి మద్దతు పలికారు. ఆ తర్వాత నుంచి లాల్‌బీకి వేధింపులు ప్రారంభమయ్యాయి. అదనపు కట్నం కావాలంటూ 2016 మే 15వ తేదీ రాత్రి భార్యతో ఖాదర్ గొడవపడ్డాడు. ఈ క్రమంలో లాల్‌బీ విష ద్రావకం తాగింది. పొద లకూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె తల్లి ఫిర్యాదుతో ఖాదర్ మ స్తాన్, అయన తల్లిదండ్రులు, షేక్ రసూల్ అనే మరో వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చే శారు. విచారణలో నేరం రుజువు కావడంతో మస్తాన్‌కు కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యా యమూర్తి తీర్పు చెప్పారు. మిగతా వారిపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసు కొట్టి వేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాధు ప్రసాద్ వాదించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6607
వెండి కిలో ధర	రూ. 85,300
వెండి ఒక గ్రాము	రూ. 87.30

అమ్మపాలు దివ్యౌషధం


నేటి నుంచి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

బిడ్డకు తల్లిపాలే ప్రాణాధారం

ఆరోగ్యానికి, ఎదుగుదలకు అవసరం

గుండె జబ్బులు, కేన్సర్ నివారణకు ఉపయుక్తం

అవగాహన కల్పించడంలో వైద్యశాఖ, ఐసీడీఎస్ నిర్లక్ష్యం



నెల్లూరు(వైద్యం), జూలై 31 : అమ్మపాలు అమృతంతో సమానం అంటారు. ఎన్నో ఔషధగుణాలు కలిగిన తల్లిపాలు శిశువుల ఆరోగ్యం, ఎదుగుదలకు ఎంతో శ్రేష్ఠమైనవి. అయితే ఈ పాల ప్రాముఖ్యతపై అటు వైద్య ఆరోగ్యశాఖ, ఇటు ఐసీడీఎస్ తగిన ప్రచారం చేయడం లేదన్నది వాస్తవం. చిన్నారులకు ప్రాణాధారమైన తల్లిపాల గురించి వైద్య నిపుణులు ఎంతో గొప్పగా చెబుతున్నా నేటి తల్లులు కొందరు బిడ్డలకు పాలివ్వడానికి ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలున్నాయి. అందం చెడిపోతుందని పిల్లలకు పాలు ఇవ్వటం లేదు. అయితే ఇది అవాస్తవమని నిపుణులు చెబుతున్నా వారిలో పరివర్తన రావడం లేదు. పుట్టిన చిన్నారికి అమృతంగా భావించే ముర్రుపాలు ప్రసవం అయిన గంట తరువాత ఇస్తారు. ఇందులో శిశువుల్లో రోగ నిరోధకశక్తితోపాటు ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు, విటమిన్లు అన్ని ఉంటాయి. భారతీయ సంప్రదాయంలోనూ తల్లిపాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుతూ ఎన్నో మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి కూడా సూచించింది.

తగిన ప్రచారం ఏది..?

తల్లిపాలపై ప్రచారం సన్నగిల్లుతోంది. జిల్లా వ్యాప్తంగా తల్లిపాల విశిష్టతను తెలిపే అవగాహన సదస్సులను వైద్య ఆరోగ్యశాఖతోపాటు, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, సంయుక్తంగా నిర్వహించాల్సి ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు జరగాలి. అలాగే పీహెచ్‌సీలలోనూ గర్భవతులకు తల్లిపాల ప్రాధాన్యతను తెలియచేయాలి. కానీ, ఈ విషయంలో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీలు చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారం రోజులు గ్రామస్థాయిలో చేపట్టాల్సిన ప్రచారాలు ప్రతి ఏడాది నత్తనడకన సాగుతున్నాయి. తల్లిపాల విశిష్టతపై గతంలో ప్రభుత్వం కరపత్రాల రూపంలో ప్రచారం చేసేది. గత ఏడాది నుంచి ఆ కరపత్రా లు కూడా రావటం లేదు.

పాలిచ్చే తల్లులకు ఎంతో మేలు

- బిడ్డలకు పాలివ్వడం వల్ల తల్లులలో రొమ్ము కేన్సర్ ప్రమాదస్థాయిని తగ్గిస్తుంది.
- గర్భాశయంలోనూ, అండాశయంలోనూ కేన్సర్‌ను నిరోధిస్తుంది. కణజాలంలో ఈస్ట్రోజన్ తక్కువగా ఉత్పత్తి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుంది.
- బిడ్డ జన్మించిన క్రమంలో రుతుక్రమం ఆగడం వల్ల బోలు ఎముకల వ్యాధి వచ్చే అవకాశాన్ని నిరోధించేందుకు బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలి.

తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించాలి



తల్లిపాల ప్రాధాన్యత గురించి తల్లిదండ్రులు తెలుసు కోవాలి. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా ఇవ్వాలి. ఎన్నో పోషకాలు తల్లిపాలలో ఉన్నాయి. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీలకు వచ్చే తల్లులకు అమ్మపాల విశిష్టతను ముందుగానే తెలియచేస్తున్నారు. తల్లిపాల వారోత్సవాలు విజయవంతం చేసేలా కృషిచేస్తాం.

- డాక్టర్ బ్రిజిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో

విద్యార్థులు శాస్త్రీయ విద్యాసాధనకు పోరాడాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్

నెల్లూరు (విద్య), జూలై 31 : విద్యార్థులు శాస్త్రీయ విద్యాసాధనకు పోరాడటంతో పాటు సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ పిలుపునిచ్చారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులో నిర్వహించిన జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను సంస్కరిస్తున్నా మంటూనే విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమ ర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానం వల్ల ప్రాథమిక విద్యతోపాటు రాష్ట్రాల ఫెడరల్ హక్కులు కూడా దెబ్బతింటాయని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారం గానికి రూ.1.48 లక్షల కోట్లు మాత్రమే కేటాయించడం బాధాకరమ న్నారు. నీట్ పరీక్షలను రద్దు చేసి నష్టపోయిన 20లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని ఆదుకుని, నిరుద్యోగులకు అండగా నిలవాలని కోరారు. టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచాలని కోరారు. కాగా, ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం సునీల్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే షారుఖ్, కోశాధికారిగా వసీం, కమిటీ సభ్యులతో కలిపి మొత్తం 17 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

'జైకా' పనుల ప్రారంభం

నెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు మనుబోలు మండలంలోని చెరువులకు మోక్షం లభించింది. ఏడాది కాలంగా నిలిచిన జైకా పనుల్లో కదలిక వచ్చింది. జూలై 22వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'నిధులున్నా నిర్లక్ష్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించారు. మనుబోలు మండలంలో రూ.7 కోట్ల జైకా నిధులతో చేపట్టిన మనుబోలు, కొలనకొదురు, ఎల్‌ఎన్‌పురం చెరువుల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. బిల్లులు వచ్చినా కాంట్రాక్టర్ పనులు చేయని వైనాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో వెంటనే సోమిరెడ్డి ఇరిగేషన్ ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో బుధవారం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. తొలుత ప్రమాదకరంగా ఉన్న కొలనకొదురు చెరువు కట్టను పటిష్ఠ పరిచే పనులు చేపట్టారు. డీఈఈ అనీల్‌కుమార్‌రెడ్డి, ఏఈ వేమారెడ్డిలు ఈ పనులను పర్యవేక్షించారు.


స్వాతంత్ర్య దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలి

● ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ

నెల్లూరు(హరనాథపురం), జూలై 31 : దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆయన స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఎవరికి కేటాయించిన విధులను ఆయా శాఖల అధికారులు బాధ్యతతో నిర్వహించాలని, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలతోపాటు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణంలో వేడుకలు జరిగేలా విద్యాశాఖాధికారులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన వినూత్నంగా, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే విధంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు 'సోమశిల'కు కృష్ణమ్మ రాక


నీరు అడుగంటి కళావిహీనంగా ఉన్న సోమశిల జలాశయం

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి కృష్ణ జలాలు గురు వారం చేరే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం చేరకోవ డంతో దిగువ క్రస్ట్‌గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్న విషయం తెలి సిందే. కాగా రాయలసీమ జిల్లాలు, తెలుగుగంగ నిర్దేశిత ప్రాంత ప్రయోజనాల దృష్ట్యా కృష్ణా జలాలు తరలించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా పోతిరెడ్డిపాడు వద్ద ఐదు రోజుల క్రితం విడుదల చేసిన జలాలు బుధవారానికి కడప జిల్లా ఆదినిమ్మాయపల్లి వద్దకు చేరినట్లు ఇంజనీర్లు గుర్తించారు. ఆ జలాలు గురువారానికి సోమశిల ప్రాజెక్టు చేరవచ్చని స్థానిక అధికారులు భావిస్తున్నారు. సోమశిలలో నీటి లభ్యత లేక జలాశయం డెడ్‌స్టోరేజ్‌కు చేరుకొని కళావిహీనంగా మారిన పరిస్థితిని చూసి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రెండవ పంటకు నీరులేక పొలాలు బీడుగా పెట్టుకొన్న తరుణంలో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వరద రావడం మూలంగా తెలుగుగంగకు మేలు చేకూరినట్టు అయ్యింది. ఈ తరుణంలో సకాలంలో కృష్ణా జలాలు సోమశిలకు తెప్పించడంలో ప్రభుత్వం చూపిన చొరవను జిల్లా రైతాగం హర్షిస్తోంది. సుమారు 5వేల నుంచి 10 వేల క్యూసెక్కుల నీరు రోజువారీగా సోమశిలకు చేరే అవకాశాలు ఉన్నాయి. కాగా, సోమశిల డ్యాంలో ప్రస్తుతం 9.496 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), జూలై 31 : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను గురు, శుక్రవా రాల్లో పంపిణీ చేయనున్నారు. గురువారం ఒక్కరోజే నూటికి నూరు శాతం పంపిణీ చేయాలనేది అధికారుల లక్ష్యం. ఒకటీ రెండు శాతం మిగిలి ఉంటే శుక్రవారం కూడా పంపిణీ చేస్తారు. ఇందుకు సంబంధించి బుధవారమే బ్యాంకుల నుంచి సచివాలయ సిబ్బంది నగదు డ్రా చేసుకున్నారు. గురు వారం ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ పంపిణీ ప్రారంభం కానుంది. జిల్లాలో సామాజిక పెన్షన్ల లబ్ధిదారులు 3,13,784 మంది ఉండగా, రూ.132.58 కోట్లను పెన్షన్ గా పంపిణీ చేయనున్నారు. కాగా, నగరం లోని 48వ డివిజన్ పొర్లుకట్టలో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ పింఛన్లు అందజేయ నున్నారు.

● రేషన్ బియ్యం కూడా..

గురువారం నుంచి రేషన్ బియ్యం పంపిణీ జరుగుతుందని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి డీవీ రమణ అన్నారు. 438 ఎండీ యూ వాహనాల ద్వారా 17వ తేదీ వరకు ఈ పంపిణీ ఉంటుందన్నారు కందిపప్పు, చక్కెరలకు సంబంధించి టెండర్ల ప్రక్రియ జరుగుతోందని, ఆ ప్రక్రియ పూర్తయ్యాక పంపిణీ ఉంటుందని సివిల్ సప్లయిస్ డీఎం లక్ష్మీనారాయణ తెలిపారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

● ఎనిమిది మంది అరెస్టు ● 40 కిలోల సరుకు స్వాధీనం

● వివరాలు వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న డీఎస్పీ కిషోర్‌బాబు, సీఐ రంగనాథ్, ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ, జూలై 31 : గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టును ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీసులు రట్టుచేశారు. ఎనిమిది మందిని అరెస్టు చేశారు. 40కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన కోల వినోద్‌కుమార్, నెల్లూరు జిల్లా మర్రి పాడు మండలం రాంపల్లికి చెందిన గోగుల రాజశేఖర్, తమిళనాడులోని తిరువణ్ణామలైకు చెందిన అర్జున్ జెమిని సులువుగా డబ్బు సంపాదించుకునేందుకు గంజాయి రవాణా, విక్రయాలను ఎంచుకున్నారు. విశాఖకు చెందిన దినేష్ అనేవ్యక్తి వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నై, ఒంగోలు, నెల్లూరు ప్రాంతాలకు తీసుకొచ్చి విక్రయిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ముగ్గురూ విశాఖలో దినేష్ వద్ద 40కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. 20 కేజీలు ఒంగోలుకు చెందిన షేక్ అజారుద్దీన్, షేక్ అబ్దుల్ సమీర్‌కు, మరో 20 కేజీలను నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలానికి చెందిన మూరం వంశి, గోపిరెడ్డి మహేష్, మాచునూరి మదన్‌లకు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఒం గోలులో పోలీసు తనిఖీలు ముమ్మరంగా జరుగుతుండటంతో అజారుద్దీన్, సమీర్ లకు అక్కడ గంజాయి ఇవ్వకుండా వారిని కూడా కారులో ఎక్కించుకొని ఐదుగురూ బయల్దేరారు. బుధవారం సింగరాయకొండ జాతీయదారి పక్కన ఉన్న పోలేరమ్మ గుడి సమీపంలో నెల్లూరు జిల్లాకు చెందిన వంశీ, మహేష్, మదన్‌లకు 20 కేజీల గంజాయిని అందజేశారు. అప్పటికే అందిన సమాచారం మేరకు సీఐ రంగనాథ్, ఎస్సై శ్రీరామ్‌లు దాడి చేసి 8 మందిని అరెస్టు చేశారని డీఎస్పీ చెప్పారు. వారి వద్ద ఉన్న 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు కారు, నెల్లూరు జిల్లాకు చెందిన వారు సింగరాయకొండకు వచ్చిన మోటారు సైకిల్‌ను సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. గంజాయి ముఠాను పట్టుకున్న సీఐ, ఎస్సైతోపాటు ఏఎస్సై శేషారెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీమన్నారాయణ, తిరుపతిస్వామి, కానిస్టేబుళ్లు విజయ్, శ్రీనివాసరావు, శ్యాంసుందర్, సుమన్, బాలరాజు ఎస్పీ దామోదర్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

దోపిడీకి పాల్పడిన వారెవరినీ వదిలిపెట్టం

● సర్వేపల్లిలో రూ. 200కోట్ల అవినీతి

● ఇరిగేషన్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం


ఇరిగేషన్ అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, జూలై 31: సర్వేపల్లి నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ శాఖలోనే దాదాపు రూ. 200 కోట్ల భారీ అవినీతి జరిగిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని అక్కంపేట, వీరంపల్లి గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించి ఇరిగేషన్ పనులు పరిశీలించారు. అక్కంపేట చెరువు, పొట్టేళ్ల కాలువలను పరిశీలించి పనులు ఎక్కడచేశారో చూపాలని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. ఇందుకు అధికారులు నీళ్ళు నమిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాది ఓఅండ్ ఎమ్, ఎఫ్‌డీఆర్, ఉపాధిహామీ, ఇతర నిధుల కింద ఒకే పనికి పనులు చేసినట్లు బిల్లులు చేసి దండుకున్నారని మండిపడ్డారు. ఇంతటి భారీ అవినీతిపై కలెక్టర్, ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు. దీనిపై విజిలెన్స్, సీబిడిని కోరుతామన్నారు. దోపిడీకి పాల్పడిన పాలకులు, అధికారులను వదిలిపెట్టమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకోం

గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందికలిగిస్తే ఊరుకోమని సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. వాటర్ ప్లాంట్ వద్ద ఉన్న నాలుగు భారీ చెట్లను నరికివేయడాన్ని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన కార్యదర్శిని పిలిచి పర్యావరణానికి నష్టం కలిగించే పనులు చేస్తుంటే ఏంచేస్తున్నారంటూ ప్రశ్నించి అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మూతపడిన వాటర్‌ప్లాంట్‌ను కార్యదర్శిచే తీయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం వీరంపల్లిలో సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను తనిఖీచేశారు. అంతకుముందు బండే పల్లి-కనుపూరు కాలువ రోడ్డుకట్టను ఆక్రమించి సాగుచేశారని, కట్టపై ఉన్న గ్రావెల్‌ను అమ్ముకున్నారంటూ రైతులు తెలపగా, సంబంధిత వ్యక్తు లపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డి జీవిఎస్‌వి ప్రసాద్, ఏవో రవి కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ శివప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు రఘురామయ్య, పూండ్ల రామకృష్ణారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు పెనమల్లి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీరని ట్రాఫిక్ సమస్య!

- విస్తరణకు నోచుకోని ఆత్మకూరు ప్రధాన రోడ్డు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

ఆత్మకూరు, జూలై 31: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు ఉన్న ప్రధానరోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. రోడ్డునకు ఇరువైపులా విస్తరణ పనులు చేపడతామన్న పాలకులు, అధికారుల హామీలు నీటిమూటలే అయ్యాయి. ఏళ్ల తరబడి విస్తరణ పనులు ఆగి పోవడంతో పట్టణంతో పాటు గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. విస్తరణ పనులు ఎప్పటికీ పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాలెం సెంటర్ నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు నాలుగురోడ్ల రహదారి పనులు పూర్తయ్యాయి. మధ్యలో సెంట్రల్ లైటింగ్, పూలమొక్కలు పెంచేలా ఆధునీకరించాలని గత మున్సిపాలిటీ పాలకవర్గం నిర్ణయించింది. అయితే రోడ్డు విస్తరణ పనులు నెల్లూరుపాలెం సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు పూర్తయ్యాయి. అక్కడి నుంచి సోమశిలరోడ్డు సెంటర్ వరకు రోడ్డు విస్తరణకు అడ్డంకులు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా విస్తరణకు సంబంధిత భవనాల యజమానులు అంగీకరించక పోవడంతో ఈ పనులు నిలిచిపోయాయి. ఈ సమస్యతో రోడ్డు అధ్వానంగా తయారైంది. దానికితోడు ట్రాఫిక్ సమస్య తీవ్రం అయ్యింది. రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రతిరోజూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాల నిలిపివేతను అరికట్టడంతో పాటు రోడ్డు విస్తరణను పూర్తి చేయాల్సి ఉంది. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించి రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆత్మకూరులో ట్రాఫిక్ అంతరాయంతో నిలిచిన వాహనాలు

ఉపాధి హామీ పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

సీతారామపురం, జూలై 31: మండలకేంద్రంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పరిశీలించారు. కూలీల పనులు, మస్టర్లను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి రోజూ ఉదయం 6:30 నుండి 11 గంటల వరకు పనిచేయాలన్నారు. ఇలా చేస్తే రోజుకు రూ.300లు వేతనం వస్తుందన్నారు. కూలీలకు పనుల గురించి సూచనలిచ్చారు. ఆయన వెంట ఏపీఓ సుహాసిని ఉన్నారు.

అద్దె భవనంలోకి పాఠశాల



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో, గ్రామస్థులు

ఉదయగిరి రూరల్, జూలై 31: గండిపాళెం మెయిన్ ప్రాథమిక పాఠశాల భవనాలు శిధిలావస్థకు చేరడంతో అద్దె భవనంలోకి మార్చినట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. బుధవారం ఆయన గ్రామస్థులతో కలిసి పాఠశాలను పరిశీలించారు. సమస్యను డీఈవో దృష్టికి తీసుకెళ్లామన్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఉన్నతాధికారుల ఆ దేశాలు, గ్రామస్థుల సూచన మేరకు పాఠశాల భవనాలను మార్చామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షాహిదాఅక్తర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సయ్యద్ ఉత్సవం



ఉత్సవానికి ముస్తాబైన దర్గా

ఉదయగిరి రూరల్, జూలై 31: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వెలసిన హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2న సందల్‌మాలి కార్యక్రమం, 3న గంధోత్సవం, 4న జప్పేచిరాగి ఫాతెహా, 5న తహలీల్ ఫాతెహా కార్యక్రమాలతో ఉత్సవం ముగుస్తుందన్నారు. భక్తులకు అన్నదానంతో పాటు పాటకచేరీ, ఖవ్వాలీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

ఉదయగిరి రూరల్, జూలై 31: లబ్ధిదారులకు గురు, శుక్రవారాల్లో ఇళ్ల వద్దకే వచ్చి సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండి పింఛన్ నగదు పొందాలని సూచించారు.

ప్రైవేటు పాఠశాలపై చర్య తీసుకోండి

అనంతసాగరం, జూలై 31: ముస్తాపురం క్రాస్ రోడ్డులోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విద్యార్థిని లాస్య తండ్రి బుజ్జిరెడ్డి, కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. ఇటీవల బుజ్జిరెడ్డిపై పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున, వారి సిబ్బంది దాడి చేసిన ఘటనపై బుధవారం ఎంఈవో-2 ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులను కలిసి వివరాలు ఆరా తీశారు. కరస్పాండెంట్ దాడి చేసిన తీరును చూసి తన కుమార్తె పాఠశాలకు వెళ్లనంటూ మారాం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గణితం సబ్జెక్టులో మార్కులు తక్కువగా వస్తున్నాయని ప్రశ్నిస్తే దాడికి పాల్పడ్డారని బుజ్జిరెడ్డి తెలిపారు.

రేపు ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, జూలై 31: రాష్ట్ర దేవదాయశాఖమాత్యులు ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం పట్టణంలో పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదల అయ్యింది. ఉదయం 10గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం తాగునీటి సరఫరాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. సమావేశంలో తహశీల్దారు కార్యాలయ నూతన భవన సౌకర్యం, ఆర్అండ్‌బీ విశ్రాంతి అతిథి భవనం పనుల పురోగతి, నూతన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో మాట్లాడుతారు. సాయంత్రం 3-30 గంటలకు చేజర్ల మండలం పెరుమాళ్లపాడులోని ఆనం గార్డెన్స్‌లో చేజర్ల మండల టీడీపీ నాయకులతో సమావేశం అవుతారు. శనివారం ఉదయం గంటలకు పెరుమాళ్లపాడులోని ఆనం గార్డెన్స్‌లో సంగం, ఏఎస్‌పేట మండలాల టీడీపీ నాయకులతో సమావేశవుతారు. రాత్రి నెల్లూరులోని ఆనం నివాసంలో బస చేస్తారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు ఏసీ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రజా వినతులను స్వీకరిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు నెల్లూరు నుండి విజయవాడ బయలుదేరుతారు.

చంద్రబాబుతోనే అన్నిరంగాల అభివృద్ధి సాధ్యం

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు



విలేకరులతో మాట్లాడుతున్న చెంచలబాబు యాదవ్

ఉదయగిరి రూరల్, జూలై 31: సంపద సృష్టించి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడకే సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ అన్నారు. బుధవారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో టీడీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనమైందన్నారు. ప్రస్తుతం జగన్ మానసిక పరిస్థితి బాగాలేదని ఎద్దేవా చేశారు. ఎన్డీయే కూటమి అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. పేదల ఇంటి నిర్మాణానికి ఇచ్చే నిధులను రూ.4 లక్షలకు పెంచడం హర్షణీయమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు మంజూరు చేయడం చంద్రబాబు కృషే అన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తొలిసారిగా అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై గళమెత్తడం, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పందించి ఉదయగిరి, వింజమూరు వైద్యశాలలకు డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు సంది రెడ్డి రామారావు, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, మాబాషా, ఖాన్ షా, రమణయ్య, మస్తాన్, సుమన్, తులసీ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భవనం పరిశీలన

ఆత్మకూరు, జూలై 31: పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ భవనాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఏఈ జూపల్లి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభిం చేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. ఈ క్రమంలో ఆత్మకూరు అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



అన్న క్యాంటీన్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ ఫజులుల్లా

అతితక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు



బిట్రగుంట, జూలై 31: పొలాల్లో 11కేవీ విద్యుత్ తీగ ఇంత తక్కువ ఎత్తులో ఉంటే ప్రమాదం జరగదా...? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. బోగోలు మండలం చెన్నారెడ్డిపాలెం-ఎస్సీ పాలెం కాలువకు తూర్పుపొలాల్లోనూ, ఏటీ కండ్రిక పొలాల్లోనూ బుధవారం 11కేవీ విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. అయితే రైతులు అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తీగలు జాయింట్ వేసేందుకు కండక్టర్ లేక పోవడంతో మూడు గంటలపాటు సిబ్బంది అవస్థలు పడ్డారు. 11కేవీ తీగలు రెండు తగులుకోకుండా రాళ్లు కట్టుకుని, కాలం వెల్లబుచ్చుతున్నామని రైతులు తెలిపారు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి సమస్య తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంపద కేంద్రాల నిర్వీర్యం

- మరుగున పడిన చెత్త సంపద తయారీ కేంద్రాలు

సీతారామపురం, జూలై 31: స్వచ్ఛభారత్ కింద గ్రామ పంచాయతీల ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు 2014లో టీడీపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద చెత్త నుంచి సంపదను తయారీ చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.8నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు చేసి మండలంలో 14కేంద్రాలను నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం జనాభాను బట్టి 14కేంద్రాల్లో 40మంది గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు. వీరికి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.6వేలు అందించాలి. వీరు గ్రామాల్లోని ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి కేంద్రానికి తరలిస్తారు. అక్కడ పేపర్లు, ప్లా స్టిక్ వస్తువులు, గాజు పరికరాలు, ఇనుప వస్తు వులు వేర్వేరుగా చేసి తడి, పొడి చెత్తగా విభజించాలి. అయితే మండలవ్యాప్తంగా గ్రీన్ అంబాసిడర్లకు కొన్ని నెలల నుంచి జీతాలు లేకపోవడంతో కొన్ని కేంద్రాల్లో తప్ప చెత్త సేకరణ చాలా గ్రామాల్లో జరగడం లేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం మారడంతో ఈ కేంద్రాలపై నిర్లక్ష్యం ప్రదర్శించారు. సంపద సృష్టి కేంద్రాలు నిర్వీర్యమై ఈ పథకం లక్ష్యం నీరుగారి పోయింది.



అయ్యావారిపల్లిలో నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రైతులకు అందని పచ్చిరొట్ట ఎరువులు

- అందుబాటులో లేని వ్యవసాయాధికారులు

అల్లూరు, జూలై 31 : తమకు అవసరమైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను అందించే పరిస్థితి మండలంలో లేకుండా పోయిందని రైతులు అంటున్నారు. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితని వారు వాపోతున్నారు. రెండో కారు పంట లేకపోవడంతో పచ్చిరొట్ట పైర్లు వేసుకొని భూములను సారవంతంగా చేసుకునేందుకు కూడా వ్యవసాయ శాఖ రైతులకు సహకరించడం లేదు. పలుమార్లు అధికారులను రైతులు, రైతు నాయకులు ప్రశ్నించినా వారిలో స్పందన లేదు. కార్యాలయంలో కూడా అధికారులు అందుబాటులో ఉండడం లేదని వారంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సబ్సిడీపై పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు, జిప్సమ్, జింగ్ సల్ఫేట్ తదితర వాటిని అందజేసేవారని, ఐదేళ్లుగా వీటిని పంపిణీ చేయడం మర్చిపోయారని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాశ అధికారులు స్పందించి పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.



ఏపుగా పెరిగిన జీలగ (ఫైల్)

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, జూలై 31: మండలంలోని చేవూరు శ్రీరామ దూత ఆశ్రమ పాఠశాలలో బుధవారం కంప్యూటర్ ల్యాబ్‌ను, విజువల్ క్లాసులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, ఆనాథ విద్యార్థుల ఎదుగుదల కోసం, ఆశ్రమం అందిస్తున్న సేవలు హర్షించదగినవన్నారు. తొలుత ఆశ్రమ సిబ్బంది వేదపారాయణం చేస్తూ, ఇంటూరికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఆశ్రమ నిర్వాహకులు దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఇంటూరి పాల్గొన్నారు. అనంతరం 154 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే దుప్పట్లు పంపిణీ చేశారు. తదుపరి ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆశ్రమ ఇన్‌చార్జి హనుమంతరావు చౌదరి, కరస్పాండెంట్ డాక్టర్ ఎం. చలపతి రావు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, డాక్టర్ చంద్రకుమార్, మాజీ ఎంపీపీ పొట్లేళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

మునునూరులో శిక్షా సప్తాహ్

కావలి,జూలై 31: పట్టణంలోని మునునూరు దళితవాడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం శిక్షా సప్తాహ్ జరిగింది. ఇందులో భాగంగా సోమవరపు శ్రీలత తన కుమార్తె హర్షిత పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక భోజనాలు, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోవిందయ్య, సీఆర్పీ శీనయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు బరమ్స్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కావలి, జూలై 31: ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశానుసారం పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్థానిక వెంగళరావునగర్‌లో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్, రోడ్డు బరమ్స్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అలాగే ఆ ప్రాంత ప్రజలు, నేతలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సాయి రామ్, ఏఈ శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టూటౌన్, రూరల్ ఎస్ఐల బాధ్యతల స్వీకరణ



వెంకటేశ్వర్లు



బాలకృష్ణ

కావలి రూరల్, జూలై 31: కావలి రెండవ పట్టణ ఎస్ఐగా వేమర్తి వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐగా కే బాలక్రిష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో వలేటి వారిపాలెం ఎస్ఐగా పనిచేసి వీఆర్‌కు వెళ్లిన వెంకటేశ్వర్లు బదిలీపై రెండో పట్టణ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే కావలి రెండవ పట్టణ ఎస్ఐగా పనిచేస్తూ ఎన్నికలకు ముందు గుంటూరు ఎస్ఐగా బదిలీపై వెళ్లిన బాలక్రిష్ణ తిరిగి కావలికి వచ్చి రూరల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

11న ఆత్మకూరు మండల సమావేశం

ఆత్మకూరు, జూలై 31 : ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం ఆగస్టు 11న నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో బాలాజీనా యక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో అన్ని శాఖల పరిధిలో చేపడుతున్న పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన తెలిపారు.

జాతీయభావం పెంపొందేలా ఐకానిక్ ఏర్పాటు

కావలి,జూలై 31: ప్రతిఒక్కరిలో జాతీయభావం పెంపొందేలా కావలిలో 100 అడుగుల జాతీయజెండా ఐకానిక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ట్రంకురోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో ఐకానిక్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. దీన్ని ఆగస్టు 15న ప్రారంభించేందుకు పనులు వేగవంతంగా చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి పాల్గొన్నారు.



జాతీయ జెండా ఐకానిక్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

మాజీ ఎమ్మెల్యే వంటేరుకు నంది అవార్డు ప్రదానం

కావలి,జూలై 31: మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామిక వేత్త వంటేరు వేణుగోపాలరెడ్డికి బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో నంది అవార్డును ప్రదానం చేశారు. 30 ఏళ్లుగా రాజకీయంగా తనగళంతో ప్రభుత్వాలను కదిలించి, కావలి అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని, సొంత నిధులతో పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాలు చేసినందుకు గుర్తుగా ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్, క్రీస్తులో సంపూర్ణత ఇవాంజికల్ మిషన్ బైబిల్ కాలేజీ, విజయ్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వంటేరును అవార్డుతో సత్కరించారు.



మాజీ ఎమ్మెల్యే వంటేరుకు నంది అవార్డును అందచేస్తున్న సంస్థ నిర్వాహకులు

నిధుల స్వాహాపై ఎంపీడీవోకి ఫిర్యాదు

లింగసముద్రం, జూలై 31 : ఐదేళ్లక్రితం ప్రహరీ గోడ నిర్మాణం డబ్బులు రూ.4.09 లక్షలు పంచాయతీ కార్యదర్శి స్వాహా చేశారని బుధవారం ఎంపీడీవో కే శ్రీనివాసరావుకు మండలంలోని వెంగళాపురం టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు ఆయనకు వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ పథకం కింద 2018 డిసెంబరు 10న సుమారు రూ.10.50 లక్షలతో వెంగళాపురం ఎంపీయూపీ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టగా, అధికారులు రూ.9.64లక్షలకు బిల్లు చేశారని తెలిపారు. ఇందుకుగాను తమకు రూ.5.55 లక్షలు వచ్చాయని చెప్పారు. అయితే తమకు రావాల్సిన మిగతా రూ.4.09 లక్షలను అప్పటి పంచాయతీ కార్యదర్శి షేక్ బాషావలి డ్రా చేసుకొని స్వాహా చేశాడని వివరించారు. స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఫిర్యాదు చేసిన వారిలో గ్రామ టీడీపీ నేతలు చిట్టిబోయిన రత్తయ్య, గొంగటి కిరణ్, లోమడ శ్రీనివాసులు, పొట్టిపాటి వీరయ్య తదితరులు ఉన్నారు.



ఎంపీడీవోకి అర్జీ అందజేస్తున్న టీడీపీ నేతలు

పేదలపై భారాన్ని మోపడమే కేంద్రం అజెండా

కావలిటౌన్, జూలై 31: పేదలపై భారాన్ని మోయడం, కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే కేంద్ర ప్రభుత్వ అజెండా అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ విమర్శించారు. పట్టణ సీపీఎం కార్యాలయంలో రెండు రోజులపాటు జరిగిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం శిక్షణ తరగుతులు బుధవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇస్తామన్నారేగానీ, బడ్జెట్‌లో కేటాయించలేదని, ముంపు పునరావాసులకు మొండి చేయి తప్పలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించలేదని, విద్య, వైద్యానికి నేటి అవసరాలకు తగ్గట్లుగా నిధులు కేటాయించలేదన్నారు. అదానీ కెంత అంబానీకెంత దోచిపెట్టాలన్నదానిపైనే శ్రద్ధ చూపించారని దుయ్యబట్టారు.కార్యక్రమంలో వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు, కార్యదర్శి మంగళి పుల్లయ్య, రాష్ట్ర నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మూలం రమేష్

సొసైటీ ద్వారా రైతులకు అందుబాటులో యూరియా

సీతారామపురం,జూలై 31 : మండలంలోని మారంరెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు కొనుగోలు చేయవచ్చని మండల వ్యవసాయ శాఖ ఏవో చెన్నారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు 13.5 మెట్రిక్ టన్నుల యూరియా సహకార సంఘంలో అందుబాటులో ఉందని తెలిపారు.యూరియా కావలసిన రైతులు బస్తాకు రూ.266.50 చెల్లించాలన్నారు. రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు. వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన పేర్కొన్నారు.

అగ్నిమాపక కేంద్రం లేక ఆస్తుల బుగ్గిపాలు

గ్రామస్థుల ఆవేదన

వెంకటాచలం, జూలై 31: మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో కష్టపడి కూడబెట్టుకున్న ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటాచలం మండలం విస్తీర్ణం రీత్యా పెద్దది. కొన్ని గ్రామాలు మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అయితే మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం లేదు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలు నెల్లూరు నుంచి కాని, పొదలకూరు నుంచి కానీ రావాల్సి ఉంది. ఈ వాహనాలు వచ్చేలోగా గంటకుపైగా సమయం పడుతోంది. దీంతో ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి. తిరుమలమ్మపాళెం పంచాయతీలోని గాజులపల్లి కోనేరు గ్రామంలో పశువుల పాకకు నిప్పంటుకుని ఏకంగా 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అదేవిధంగా ఇటీవల వెంకటాచలం గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి షేక్ నసూరుద్దీన్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా లక్షల రూపాయల విలువచేసే సామగ్రి దగ్ధమైంది. గడిచిన ఏడాది కాలంలో పలు గ్రామాల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు గడ్డివాములు బూడిదయ్యాయి. తరచుగా అగ్నిప్రమాదాలు సంభవించి ఆస్తినష్టాలు జరుగుతున్నాయని గ్రామస్థులు, రైతులు వా పోతున్నారు.

వైసీపీ పాలనలో అటకెక్కిన కేంద్రం ఏర్పాటు

మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు చేసిన విజ్ఞప్తితో గత టీడీపీ ప్రభుత్వం కేంద్రం ఏర్పాటుకు 2018లో సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆనాడు మంత్రిగా ఉన్న ప్రస్తుత సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచనల మేరకు అధికారులు మండలంలో పర్యటించి సర్వేపల్లి గ్రామంలో కేంద్రం ఏర్పాటుచేస్తే అన్ని గ్రామాలకు అగ్నిమాపక వాహన సేవలు సకాలంలో అందుతాయని అభిప్రాయ పడ్డారు. ఆమేరకు సర్వేపల్లి గ్రామం వద్ద ఒక స్థలాన్ని ఎంపికచేశారు. కానీ ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఏర్పాటును పట్టించుకోలేదు. కాగా, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రావడం, సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి ఉండడంతో ఇప్పటికైనా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటవుతుందని గ్రామస్థులు ఆశిస్తున్నారు.

వరిపొలాల పరిశీలన



వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

కోవూరు, జూలై 31: స్థానిక గుమ్మళ్ళదిబ్బ పరిసరాల్లోని వరి పొలాలను వ్యవసాయ సహాయ సంచాలకులు సుజాత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వరిసాగుపై రైతులకు అవగాహన కల్పించి పలు సూచనలు అందచేశారు. కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు పొందాల్సిందిగా కోరారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వీఏఏలు మెహరున్నీసా, చైతన్య తదితరులు ఉన్నారు. రైతు నాయకుడు గాదిరాజు సుధాకర్ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు వరి పొలాలను పరిశీలించారు.

టీడీపీ కార్యకర్తకు నేతల పరామర్శ

ఇందుకూరుపేట, జూలై 31: మండలంలోని కొత్తూరు పాములవారిపాలెంకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఎర్రపురెడ్డి సురేష్ కొద్దిరోజులుగా తిరుపతి రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రనాయుడు సురేష్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు, రామచంద్రయ్య, కుమార్, సింధూర కృష్ణ, కైలాసం వెంకటరమణయ్య, పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

విడవలూరు, జూలై 31: రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండే మేక పోతుల డొంక, కొంగలమిట్ట డొంక, దరకాస్తు డొంకలో ఆక్రమణలు తొలగించాలని వరిణి గ్రామానికి చెందిన రైతులు బుధవారం ఇన్‌చార్జి తహసీల్దారు భానుప్రకాష్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు వెయ్యి ఎకరాల రైతుల రాకపోకలు ఉపయోగపడే డొంకలను కొందరు ఆక్రమించుకుని వారి పోలాల్లో కలుపుకున్నారన్నారు. దీనివలన డొంకలు కుంచించుకుని పోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆక్రమణలో ఉన్న డొంకలను సర్వేచేసి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు. తహసీల్దారును కలిసిన వారిలో రైతులు ఎం రాజన్న, ఎం మల్లికిషోర్, నట్టం జనార్దన్, నట్టం మహేష్, పి సురేష్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛందంగా కాలువలో పూడికతీత

కోవూరు, జూలై 31: స్థానిక చుండిగుంట దళిత కాలనీలో బుధవారం టీడీపీ నాయకుడు విజయకుమార్ ఆధ్వర్యంలో కాలనీవాసులు చవిటి కాలువలలో స్వచ్ఛందంగా పూడిక తీశారు. చవిటి కాలువలో పూడికతీయమని పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించక పోవడంతో స్వచ్ఛందంగా కాలువలు శుభ్రపరచి మురుగునీరు వెళ్ళే మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పర్యటన

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోవూరు పట్టణంలో గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి తెలిపారు. గుమ్మళ్ళదిబ్బ కాలనీలో పింఛన్ల పంపిణీ అనంతరం స్థానిక మెథీలీ కూడలిలోని దొంపల కాలువ పూడికతీత పనుల్ని పర్యవేక్షిస్తారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాల్సిందిగా కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కొడవలూరు, జూలై 31: మండలంలో యల్లయపాళెం గ్రామం ప్రభుత్వ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు చెడిమల వివేకానందరెడ్డిని ఉద్యోగ విరమణను పురస్కరించుకొని ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన రామలింగయ్య, పాఠశాల సిబ్బంది, నెల్లూరు నగర మాజీ కార్పోరేటర్లు వేణుంబాక సుధాకర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి ఆషాడమాస సారె సమర్పణ



ప్రత్యేక అలంకారంలో కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 31: జొన్నవాడ ఆలయంలో కామాక్షితాయికి పలువురు ముత్తైదువులు బుధవారం ఆషాడ మాససారె సమర్పించారు. ముందుగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి, భక్తులు, ముత్తైదువులు అమ్మవారి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని అలంకార మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ఖడ్గమాల పూజ నిర్వహించారు. అనంతరం ముత్తైదువులు తెచ్చిన సారెను అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదములు పంపిణీ చేశారు. ఆషాడమాసం సందర్భంగా బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం తరహాలో జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో ఆషాడమాస సారె కార్యక్రమం నూతనంగా ప్రారంభించినట్టు ఆలయ పండితులు తెలిపారు.

రేపటి నుంచి బీచ్ కబడ్డీ పోటీలు

ఇందుకూరుపేట, జూలై 31: మండలంలోని కొత్తూరు ఎంకేఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో యువ నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి సారథ్యంలో పముజుల శ్రీనివాసులు మహాలక్ష్మమ్మ స్మారక 11వ ఆంధ్ర రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలు ఆగస్టు 2, 3, 4 తేదీలలో జరుగుతాయని, ప్రతిరోజు సాయంత్రం 4గంటల నుంచి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పముజుల రవి, విజయ్ తెలిపారు. బుధవారం సభావేదికను, పోటీల నిర్వహణ ఏర్పాట్లను వారు పరిశీలించారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

కొడవలూరు, జూలై 31: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎండీ హనీఫ్ హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గంజాయి, గుట్కా వంటి నిషేధిత పదార్థాలు వినియోగించినా, రవాణా చేసినా, సహకరించినా చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని, డ్రగ్స్, పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపరాదని హెచ్చరించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 21 కోట్లతో కనిగిరి రిజర్వాయర్ ఆధునికీకరణ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 31: కనిగిరి రిజర్వాయర్ ఆధునీకరణకు రూ.21కోట్లు అంచనాలు తయారుచేసి త్వరలో పంపించనున్నట్టు నీటిపారుదల శాఖ బుచ్చి సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్ మధు బుధవారం తెలిపారు. మంగళవారం పాక్షికంగా దెబ్బతిన్న రిజర్వాయర్ బండ్ రివిట్‌మెంట్‌ను ఏఈలు, సిబ్బందితోపాటు పలువురు రైతులతో పరిశీలించినట్టు తెలిపారు. ఆమేరకు బుధవారం కొత్త ఎస్ఎస్ఆర్ (ధరలు) ప్రకారం అంచనాలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. పైడేరు ఎస్కేప్ ఛానల్, ఈస్టర్న్ ఛానల్, సదరన్ ఛానల్ రెగ్యులేటర్లు, బ్రిడ్జిలు దెబ్బతిన్న రిజర్వాయర్ బండ్, రివిట్‌మెంట్లు మరమ్మతులు, కొత్త నిర్మాణాలు చేపట్టనున్నట్టు వారు తెలిపారు.

ప్రాథమిక దశలోనే కుష్టువ్యాధిని గుర్తించాలి



మహిళను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

పొదలకూరు, జూలై 31: కుష్టువ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి ఎండీటీ (మల్టీ డ్రగ్ థెరపీ) మందులు వాడితే అంగవైకల్యం నివారించవచ్చునని జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని విరువూరులో రోగుల గుర్తింపు కార్య క్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తిని కలిసి రాగి రంగు, స్పర్శలేని, చెమట పట్టని మచ్చలను గుర్తించి ప్రాథమిక వైద్యాధికారికి తెలియజేయాలన్నారు. అనంతరం విరువూరు స్కూల్‌లో పిల్లలకు కుష్టు వ్యాధికి సంబంధించిన మచ్చల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎం మోహన్‌రావు, ఆరోగ్య పర్యవేక్షకులు నరసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సైదాపురం, జూలై 31: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు చట్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాపూరు సీడీపీవో సునంద మాట్లాడారు. బాల్య వివాహాలు, ఫోక్సో యాక్ట్, పిల్లల దత్తత వంటి చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో ఏవో పురుషోత్తం శివకుమార్, ఏపీఎం రాధ, డాక్టర్ జనార్దన్, ఐసీపీసీఎస్ సమత, న్యాయవాది మంజుల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాధిక పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది తీరుపై డీఐవో విచారణ



డీఐవో ఉమామహేశ్వరికి వైద్య సిబ్బంది తీరును వివరిస్తున్న స్థానికులు

సైదాపురం, జూలై 31: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంల మధ్య నడుస్తున్న వివాదాలపై బుధవారం డీఐవో ఉమామహేశ్వరి విచారణ చేపట్టారు. వైద్యులు, సూపర్‌వైజర్లు మానసికంగా తమను ఇబ్బంది పెడుతున్నారని ఏఎన్ఎంలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, ఏఎన్ఎంల మధ్య జరుతున్న వివాదాలపై నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశారు. విచారణ సమయంలో స్థానికులు పీహెచ్‌సీకి చేరుకుని మాట్లాడారు. వైద్య సిబ్బంది వివాదాలతో సక్రమంగా వైద్య సేవలందడం లేదని, వైద్యాధికారులతో పాటు సిబ్బందిని బదిలీ చేయించాలని డీఐవోకు విన్నవించారు.

నిందితుడిపై అత్యాచార, హత్యాయత్నం కేసులు పెట్టాలి

● సీఐకి దిశ బృందం వినతి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 31: ఓ మహిళపై అత్యాచార, హత్యాయత్నం చేసిన యువకుడిపై కేసులు నమోదు చేయాలని దిశ బృందం బుధవారం సీఐ హైమారావును కోరింది. ఈ మేరకు దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు విజయనిర్మల మాట్లాడుతూ బాధిత మహిళ న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే దాడి కేసు నమోదుతో యువకుడిని వదిలేసి చేతులు దులుపుకోవడం న్యాయమా అని మండిపడ్డారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తాము అండగా పోరాడుతామన్నారు. కార్యక్రమంలో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మల్లెం విమలమ్మ, జిల్లా అధికార ప్రతినిధి సులోచనమ్మ, కార్యదర్శులు ఆవుల సుప్రియ, రాజ్యలక్ష్మి (కీర్తిరెడ్డి), రమణమ్మ తదితరులున్నారు.

టూరిజం సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



టూరిజం ఎండీని అభినందిస్తున్న జేఏసీ ప్రతినిధులు

కోవూరు, జూలై 31: ఏపీ టూరిజం కార్పోరేషన్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆ శాఖ మేనేజింగ్ డైరెక్టరు ఎం అభిషిక్త్‌కిషోర్ హామీ ఇచ్చా రని ఏపీ టూరిజం ఎంప్లాయీస్ జేఏసీ అసోసియేట్ ప్రెసిడెంటు తురకా శ్రీనివాసులు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను బుధవారం విజయవాడలోని ఎండీ కార్యాలయంలో కలిసి అభినందించినట్లు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో నూతన జేఏసీ ఛైర్మన్ శివారెడ్డి, కన్వీనర్ రోసిరెడ్డి ఉన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి



దిశ పోలీసు స్టేషన్ ఎదుట చెట్టుకింద మందు కలుపుతూ..



ఎక్కడపడితే అక్కడే!!

నగరంలో మందుబాబులు ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తున్నారు. ఖాళీ స్థలాలు చెట్ల కింద, రోడ్డుపైన కూడా మందేస్తున్నారు. కొందరైతే గ్లాసులు, నీళ్లు తెచ్చుకుని రోడ్ల పక్కన ఉండే బంకుల్లోనూ తెగ తాగుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్య, ధూమపానంపై ఆంక్షలు ఉన్నప్పటికీ వాటిని ఎవరూ పాటించడం లేదు. విచ్చల విడిగా మద్యం తాగుతున్న వారు ఆ తర్వాత తూగుతూ, అసభ్యంగా ప్రవర్తిస్తూ మహిళలు, పిల్లలకు అసౌకర్యం కలిగిస్తున్నారు.



- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్





కరెంటాఫీసు సెంటర్‌లో దుకాణాల వద్ద మందుకొడుతున్న వ్యక్తులు




చింతారెడ్డిపాళెంలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నెల్లూరు రూరల్, జూలై 31 : నగరంలోని చింతారెడ్డిపాళెంలో రూ.50 లక్షలతో నిర్మించబోతేతున్న సీసీ రోడ్డు పనులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రూరల్లో గెలవడంతో పోల్చితే చింతారెడ్డిపాళెంలో మెజార్టీ రావడం ఎక్కువ సంతోషానిచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాజానాయుడు, కోడూరు కమలాకర్‌రెడ్డి, అబ్రహం, తనూజా తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహాలకు బిల్లులు అభినందనీయం

● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

నెల్లూరు(వైద్యం), జూలై 31 : ఎన్టీఆర్ గృహాలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించటం అభినందనీయమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014 - 19 మధ్య ఎన్టీఆర్ గృహ పథకం కింద గృహాలు మంజూరై పూర్తి చేసిన 3 లక్షల మంది లబ్ధిదారులకు చంద్రబాబు నిర్ణయంతో ఉపశమనం కలుగుతుందని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ నిధుల చెల్లింపుపై నిర్లక్ష్యం వహించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఇళ్లు నిర్మించుకున్నందునే అప్పటి సీఎం జగన్ బిల్లులు చెల్లించకుండా కక్షపూరితంగా వ్యవహరించారని విమర్శించారు.

రోడ్డు భద్రతపై ప్రభుత్వ వైద్యశాలలో ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

నెల్లూరు(వైద్యం), జూలై 31 : రోడ్డు భద్రతపై నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం ప్రదర్శన జరిగింది. ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు కలిసి వైద్య కళాశాల నుంచి ప్రసూతి ఆసుపత్రి వరకు ప్రదర్శన నిర్వహించారు. కమ్యూనిటీ మెడికల్ డిపార్టుమెంట్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని, నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు భద్రత పాటించకపోవటం వల్ల జరిగే ప్రమాదాలతో ఎంతో మంది మరణిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు, ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదవితేనే ఉన్నత శిఖరాలకు...

● బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటయ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య

నెల్లూరు(హరనాథపురం), జూలై 31 : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కసితో ఇష్టంగా చదవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంటయ్య సూచించారు. కళాశాలల క్షేత్ర పరిశీలనలో భాగంగా ఆయన బుధవారం నగరంలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశా లను సందర్శించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు పరిశ్రమించాల న్నారు. తరగతి గదిలో పాఠ్యాంశాలపై ఏమైనా సందేహాలు ఉంటే అక్కడికక్కడే అధ్యాపకుల నడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. 75 శాతం కళాశాల హాజరు తప్పని సరిగా ఉండాలని, అప్పుడే ప్రభుత్వ పథకాలను విద్యార్థులు పొందగలరని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు హరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

నెల్లూరు(హరనాథపురం), జూలై 31 : వైద్య, ఆరోగ్యశాఖ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ స్టేట్ గవర్నమెంటు మెడికల్ అండ్ హెల్త్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఏ హరిబాబు తెలిపారు. నగరంలోని సరస్వతి సమాజంలో బుధవారం ఆ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ట్రెజరీ కార్యాలయం పరిధిలో తమ అసోసియేషన్ ఉప సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కల్వం శ్రీనివాసులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల పెన్షన్‌ను వారి స్వస్థలానికి దగ్గరగా ఉన్న ఉపఖజానా కార్యాలయానికి మార్పు చేయాలని జిల్లా ఖజానా అధికారిని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఈసీ విద్యాసాగర్, కోశాధికారి దారం నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోహన్‌రెడ్డి జ్యూవెలరీలో ఆషాఢమాసం రాయితీలు



నెల్లూరు (సాంస్కృతికం), జూలై 31 : నగరంలోని చిన్నబజార్ కాకర్లవారివీధిలోని మోహన్‌రెడ్డి జ్యూవెలరీలో ఆషాఢ మాసం రాయితీలతో వ్యాపారం జోరుగా సాగుతోంది. ఆషాఢ మాసం సందర్భంగా బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.500, నవర (8గ్రాములు)కు రూ.4వేలు తగ్గింపు, డైమండ్స్‌పై క్యారెట్‌కు రూ.5వేలు తగ్గింపుతోపాటు ఈఎఫ్ కలర్, వీవీఎస్ఐ క్లారిటీ, ఐజీఐ సర్టిఫికెట్ వంటి సదుపాయాలను వినియోగదారులకు కల్పిస్తున్నారు. వెండి వస్తువులకు తరుగు, కూలీలు లేవు. ఈ షాపులో 916 కేడీఎం, బీఎస్ఐ హాల్‌మార్క్‌తో వడ్డాణాలు, లాంగ్ హారాలు, నెక్ లాకెట్లు, చౌకర్స్, గాజులు, సరుడ్లు, చైన్లు, నల్లపూసల దండలు, జుంకీలు, డాలర్లు, ఉంగరాలు, కమ్మలను లేటెస్ట్ డిజైన్లతో విక్రయిస్తున్నారు. 916 కేడీఎం హాల్ మార్క్ బంగారు ఆభరణాలపై తరుగు, కూలీలు, రాళ్ల చార్జీలు లేవు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ షాపు అధినేత మోహన్‌రెడ్డి కోరారు.

నేడు మంత్రి నారాయణ అర్జీల స్వీకరణ

నెల్లూరు(సిటీ), జూలై 31 : రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని కమిషనర్ ఎం సూర్యతేజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 1 గంట మధ్య మంత్రి అందుబాటులో ఉంటారని తెలిపారు. సిటీ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన వినతులు, ఫిర్యాదులు మాత్రమే స్వీకరిస్తారని, నగర వాసులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భవన నిర్మాణాలన్నీ నిబంధనలు ప్రకారమే ఉండాలి

● సిటీప్లానింగ్ విభాగం సమీక్షలో కమిషనర్ సూర్యతేజ



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), జూలై 31 : నగరంలో జరుగుతున్న భవన నిర్మాణాలన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ ఆదేశించారు. బుధవారం సిటీప్లానింగ్ విభాగం అధికారులు, ఉద్యోగులతో కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. భవన నిర్మాణాల కోసం యజమానులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకు న్న వెంటనే క్షేత్ర స్థాయిలో సచివాలయ సిబ్బంది పరిశీలించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలిచేయాలన్నారు. తొలుత నియమ, నిబంధనలు పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీ దేవికుమార్, టీపీవో దశయ్య పాల్గొన్నారు. కాగా, కార్పొరేషన్ డీఈఈ (ఎలక్ట్రికల్) నాగేంద్ర ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఆంధ్రజ్యోతి కథనంపై చర్చ

కార్పొరేషన్‌లోని సిటీప్లానింగ్ విభాగంలో ఓ అధికారి అవినీతికి అంతులేకుండా పోతోందంటూ 'సిటీప్లానింగ్‌లో అవినీతి తిమింగలం' శీర్షికతో ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంపై ఈ సమావేశంలో అరగంటపాటు చర్చ జరిగినట్లు సమాచారం. అవినీతి కథనం విషయమై సదరు అధికారితో కమిషనర్ సూర్యతేజ చర్చించినట్లు తెలిసింది. సమగ్రంగా వివరాలు కోరినట్లు విశ్వసనీయ సమాచారం. రాజకీయ వర్గాల్లోనూ ఈ కథనం చర్చనీయాంశంగా మారింది.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

నెల్లూరు రూరల్, జూలై 31 : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువుతీరాలని, నెల్లూరు రూరల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించాలన్న కోరికలు నెరవేరడంతో సింహాచల అప్పన్నను దర్శించుకున్నట్లు ఆ పార్టీ నాయకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం అప్పన్న దర్శనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామశంకర్, సుబ్బారావు పాల్గొన్నారు.

గణనాథులకు చందనాలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 31 : నగరంలోని పురమందిరం జ్యోతి వినాయస్వామి మందిరంలోని 33 మంది వినాయకులకు బుధవారం చందనాలంకారం కన్నుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి దర్శించుకున్నారు.

ఏసీ స్టేడియంలో బల్లల ఏర్పాటు

నెల్లూరు (విద్య), జూలై 31 : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సందర్శకుల విశ్రాంతి కోసం బల్లలను ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, కార్యదర్శి స్వర్ణ రమేష్ బాబు, కోశాధికారి కే జయదేవ్, సభ్యులు పాల్గొన్నారు.

నరసింహారావుకు ఘనంగా వీడ్కోలు

నెల్లూరు (లీగల్): న్యాయశాఖ ఉద్యోగి కే నరసింహారావు (టైగర్) ఉద్యోగ విరమణ సందర్భంగా ఆ శాఖ ఉద్యోగులు బుధవారం జిల్లా కోర్టు అవరణలో ఘనంగా వీడ్కోలు పలికారు. కాయి డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న ఎస్ శరత్ కుమార్‌రెడ్డికి కూడా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమాల్లో 8వ అదనపు (ప్రత్యేక మహిళా కోర్టు) జిల్లా జడ్జి జీ గీత, రాష్ట్ర సంఘం జనరల్ సెక్రటరీ కే గోపీనాథ్, వైస్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, జిల్లా ప్రెసిడెంట్ సుధాకర్, నాయకులు ఈసీ నారాయణరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.


అటవీ రేంజర్‌గా మాల్యాద్రి

నెల్లూరు (వెంకటేశ్వరపురం): జిల్లా అటవీశాఖలో ఇటీవల రేంజర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఎస్ మాల్యాద్రిని నెల్లూరు రేంజర్‌గా నియమిస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన బుధవారం నెల్లూరు రేంజర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

గురువారం 1 ఆగస్టు 2024

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన మేరకు పదవుల పందేరానికి ముహూర్తం సమీపిస్తోంది. కూటమి పార్టీల అధిష్ఠానాలు ఎంపిక ప్రక్రియపై కసరత్తు ప్రారంభించాయి. ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కష్టపడి పనిచేసిన నాయకులు, క్రియాశీలక కార్యకర్తల వివరాలను సేకరిస్తున్నాయి. ఆగస్టు మొదటి వారం తర్వాత విడతల వారీగా నామినేటెడ్ పదవులు భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఆగస్టు నెలాఖరులోపు సాధ్యమైనంత వరకూ మొత్తం పదవులు భర్తీ చేసే అవకాశం వుంది. దీంతో జిల్లాలో ఆశావహుల ప్రయత్నాలు జోరందుకున్నాయి. రెండేళ్ళ తర్వాత పరిస్థితులు ఎలా వుంటాయోనని తొలి విడతలోనే ఛాన్సు కొట్టేయాలని ఆశావహులు ఆరాటపడుతున్నారు. దీంతో చివరి ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వీరీ.. వీరీ.. గుమ్మడి పండూ..

వీరికే పదవి?

కష్టపడిన వారిని గుర్తిస్తున్న అధిష్ఠానాలు

కూటమి పార్టీల అధిష్ఠానాలు నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యాయి. టీడీపీ విషయానికొస్తే నియోజకవర్గం నుంచీ వందమంది పేర్లను అప్‌లోడ్ చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. ఆ మేరకు ఇప్పటికే జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచీ 80 వరకూ పేర్లు అధిష్ఠానానికి అందాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు జిల్లావ్యాప్తంగా 100-150 పేర్లు పంపించాల్సి వుంది. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి కష్టపడిన వారి జాబితా అప్‌లోడ్ చేసే బాధ్యత కూడా జిల్లా అధ్యక్షుడికే అప్పగించినట్టు సమాచారం. ఇప్పటి వరకూ తిరుపతి నుంచీ 90 పేర్లు అప్‌లోడ్ అయ్యాయని చెబుతున్నారు. జనసేన పార్టీలో కూడా ఇదేరకమైన వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. ఈ పేర్లు ముందుపెట్టుకుని వారి స్థాయిని బట్టి స్థానికంగా ఆలయ కమిటీల్లో సభ్యులుగా, ఛైర్‌పర్సన్లుగా, మార్కెట్ కమిటీలలో డైరెక్టర్లుగా, ఛైర్‌పర్సన్లుగా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్లలో డైరెక్టర్, ఛైర్‌పర్సన్ పోస్టులకు ఎంపిక చేయనున్నారు.

అందరి గురీ టీటీడీ, తుడాలపైనే!

టీటీడీ బోర్డు ఛైర్మన్, మెంబరు పదవులపైన, తుడా ఛైర్‌పర్సన్ పదవిపైనా ఎక్కువమంది ఆశావహులు గురి పెడుతున్నారు. టీటీడీ ఛైర్మన్ పదవి రాష్ట్రస్థాయిలో కీలకం కావడంతో జిల్లానుంచీ ఒకరిద్దరు మాత్రమే ఆశిస్తున్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ తాను గతంలో తుడా ఛైర్మన్‌గా పనిచేసినందున ఈ పర్యాయం టీటీడీ ఛైర్మన్ పదవి ఇవ్వాలని, తిరుపతి ప్రాంత యాదవులతో శ్రీవారి ఆలయానికి వున్న అవినాభావ సంబంధాన్ని దృష్టిలో వుంచుకుని తనకు అవకాశం కల్పించాలని గట్టిగా కోరుతున్నారు. తన వయసు దృష్ట్యా రాజకీయంగా ఇదే తనకు చివరి అవకాశమని గుర్తు చేస్తున్నారు. టీటీడీ ప్రయోజనాల కోసం పోరాడిన నేపథ్యం కలిగిన తనను ఛైర్మన్‌గా నియమించాలని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి అభ్యర్థిస్తున్నారు. వీరిద్దరే బాహాటంగా టీటీడీ ఛైర్మన్ పదవి కోరుతున్నారు.

టీటీడీ మెంబరు కోసం 300 దరఖాస్తులు

టీటీడీ బోర్డు మెంబరు పదవి కోసం రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబుకు ఇప్పటి వరకూ 300 దరఖాస్తులు అందినట్టు సమాచారం. మూడు పార్టీలతో కూడిన కూటమి ప్రభుత్వం కావడం వల్ల చంద్రబాబుపై టీటీడీలో మెంబరు పదవుల కోసం మూడు పార్టీల నుంచీ విపరీతమైన ఒత్తిడి వుంది. 24 మందిని మాత్రమే నియమించే వీలున్నందున ఆశావహులను వడపోయడం సంక్లిష్టంగా మారిందని సమాచారం. జిల్లాకు లేదా తిరుపతికి కనిష్టంగా ఒకటి లేదా గరిష్టంగా రెండు మెంబరు పదవులకు మించి కేటాయించే అవకాశం లేదు. ఒత్తిడి ఎక్కువైతే ఒక్కటి కూడా ఇవ్వకపోయినా ఆశ్చర్యపడాల్సిన పని లేదు. జిల్లా నుంచీ బోర్డు మెంబరు కావాలని చాలామంది ఆశిస్తున్నారు. టీడీపీ నుంచీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ, హేమాంబరధర రావు, ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్ తదితరులు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అలాగే జనసేన నుంచీ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ ఈ పదవి కోసం రేసులో వున్నారు. బీజేపీ నుంచీ ఛైర్మన్ పదవి రాకపోతే మెంబరు పదవి ఇవ్వాలని భానుప్రకాష్‌రెడ్డి కోరుతుండగా సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్ పేర్లు కూడా పరిశీలనలో వున్నాయి. వీరిలో పలువురు గత ప్రభుత్వంలో పోలీసు కేసులు, వేధింపులకు గురయ్యారు. అలాగే కొందరు తమ పార్టీల కోసం కష్టకాలంలో ఆర్థిక భారం కూడా వహించారు.

తుడా ఛైర్మన్ పదవికి పలువురు ఆశావహులు

టీటీడీలో ఎక్స్ అఫిషియో మెంబరు హోదా కలిగిన తుడా ఛైర్మన్ పదవిని సైతం పలువురు నేతలు ఆశిస్తున్నారు. బ్రహ్మాండమైన కార్యాలయం, సిబ్బంది, వనరులు, క్యాబినెట్ హోదా కలిగిన పదవి కావడంతో ఈ పదవికి క్రేజ్ పెరిగింది. ఈ పదవికి తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, చంద్రగిరి నేతలు డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధా యాదవ్, తిరుపతి నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రవినాయుడు తనకు అవకాశం ఇస్తే సామాన్య కార్యకర్తను గుర్తించినట్టు అవుతుందని, యువతను ప్రోత్సహించినట్టు అవుతుందని చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ళూ కష్టపడి పనిచేశానని, యువగళం పాదయాత్రలోనూ, అలాగే అధినేత సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమంలోనూ వెన్నంటి నడిచానని చెబుతున్నారు. బడి సుధా యాదవ్ చంద్రగిరి ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శ్రమించగా దివాకర్‌రెడ్డి శ్రీకాళహస్తి, చంద్రగిరిల్లో పార్టీ కోసం పనిచేశారు. దేవనారాయణరెడ్డి తిరుపతి, చంద్రగిరి సెగ్మెంట్లలో పార్టీ కోసం పనిచేశారు. వీరిలో రవినాయుడు, సుధా యాదవ్, దేవనారాయణరెడ్డి పార్టీ కోసం పలు పోలీసు కేసులు, వేధింపులు ఎదుర్కొన్నారు. జనసేన నుంచీ హరిప్రసాద్, కిరణ్ రాయల్ టీటీడీ బోర్డు మెంబరు కాకుంటే తుడా ఛైర్మన్ పోస్టు అయినా దక్కుతుందని ఆశిస్తున్నారు. వారిలో కిరణ్ రాయల్ గత వైసీపీ ప్రభుత్వంలో పోలీసు కేసులు, వేధింపులకు గురయ్యారు.

జోరందుకున్న ఆశావహుల యత్నాలు

నామినేటెడ్ పోస్టుల భర్తీకి సమయం సమీపించడంతో ఆశావహుల యత్నాలు జోరందుకున్నాయి. పలువురు నేరుగా తమ పార్టీల అధినేతలను కలుస్తున్నారు. ఆయా పార్టీల కోసం తాము అందించిన సేవలను గుర్తు చేస్తూ, పార్టీల కోసం తాము పడిన కష్టాలను ఏకరువు పెడుతున్నారు. తమకు ఫలానా పదవి కావాలని కొందరు సూటిగా ప్రస్తావిస్తుండగా మరికొందరు ఫలానా పదవి ఇవ్వాలని అది లేకుంటే ప్రత్యామ్నాయంగా ఫలానా పదవి ఇవ్వాలని అధిష్ఠానాల ఎదుట ప్రతిపాదనలు పెడుతున్నారు. కొందరైతే ఏ పదవి ఇచ్చినా పర్వాలేదని అధిష్ఠానాలకే వదిలి పెడుతున్నారు.

ప్రత్యామ్నాయంగా పార్టీ పదవులు

ప్రభుత్వ నామినేటెడ్ పదవుల కోసం పోటీ పెరిగిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పదవులు తెరపైకి వస్తున్నాయి. టీడీపీలో జిల్లా పార్టీ అధ్యక్ష పదవి, తిరుపతి అసెంబ్లీ ఇంఛార్జి పదవులతో ఇద్దరిని సమాధానపరిచే అవకాశం కనిపిస్తోంది. అధికారంలో వున్నందున పార్టీ పదవులు తీసుకునేందుకు కొందరు సిద్ధంగా వున్నారు. అయితే వట్టి పార్టీ పదవులే అయితే తమకు అధికారులు విలువ ఇవ్వరని, ఏదో ఒకటి ప్రోటోకాల్ పదవి కూడా అనుబంధంగా ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నారు. ఇదే పరిస్థితి జనసేన పార్టీలోనూ కనిపిస్తోంది. ఆశావహుల్లో ఎవరో ఒకరిని జిల్లా అధ్యక్ష పదవితో సంతృప్తిపరిచే అవకాశముంది.

ఈ నెలలోనే నామినేటెడ్ పదవుల పందేరం

జోరందుకున్న ఆశావహుల యత్నాలు

జిల్లాలో భర్తీకి అవకాశం వున్న పదవులు ఇవీ!

జిల్లాలో టీటీడీ ట్రస్టు బోర్డు ఛైర్మన్, బోర్డు మెంబర్లు, తుడా ఛైర్‌పర్సన్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు కీలకమైనవి. ఇందులో టీటీడీ ఛైర్మన్ నిస్సందేహంగా రాష్ట్రస్థాయి పదవి. తుడా ఛైర్‌పర్సన్, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు క్యాబినెట్ ర్యాంకు కలిగినవే అయినా వాటిని జిల్లాస్థాయి పదవులుగానే పరిగణించే పరిస్థితి. తర్వాత కేటగిరీలో , ముక్కంటి, చెంగాలమ్మ, సురుటుపల్లి, వెంకటగిరి పోలేరమ్మ, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తదితర ముఖ్య ఆలయాల పాలక మండళ్ళు, జిల్లా గ్రంధాలయ అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ పదవులున్నాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండళ్ళు వున్నాయి. ముక్కంటి ఆలయం మొదలుకుని ఇవన్నీ స్థానిక ప్రాధాన్యత కలిగిన పదవులు. ఇవి కాకుండా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు, వాటిల్లో డైరెక్టర్ పదవులు కూడా కొన్ని జిల్లాకు దక్కే అవకాశముంది. వివిధ అకాడమీలు, వక్ఫ్ బోర్డు, హజ్ కమిటీ, మహిళ, ఎస్సీ, మైనారిటీ కమిషన్ల ఛైర్‌పర్సన్ పదవులు, వాటిలో డైరెక్టర్ పదవులు వంటికి కూడా కొన్ని జిల్లా నేతలకు దక్కవచ్చు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



వైసీపీ నేతల లీలలపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వండి

- ఆర్సీపురంలో రూ.కోటి స్థలం స్వాహాపై సీసీఎల్‌కు రెవెన్యూ మంత్రి కార్యదర్శి లేఖ
- ఇరువర్గాల వాదనలు విన్న ఆర్డీవో

తిరుపతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలంలోని భూవివాదంపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కార్యదర్శి ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ)కు బుధవారం లేఖ రాశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత నెలరోజులుగా భూ కబ్జాలపై ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల్లో ప్రచురితమైన కథనాలను జతచేస్తూ సీసీఎల్ఏకు రెవెన్యూ శాఖ కార్యదర్శి లేఖరాశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 9 భూవివాదాల వార్తలుండగా అందులో రామచంద్రాపురం మండల పరిధిలోని భూమికి తిరుపతి రూరల్ తహసీల్దార్ ధృవీకరించినట్టు నకిలీ రికార్డు తయారు చేసిన వైసీపీ నేతల వ్యవహారంపై ప్రచురించిన కథనం కూడా ఉంది. మూడు రోజుల్లో సీసీఎల్ఏ ఇచ్చిన నివేదిక ఆధారంగా తగు చర్యలను రాష్ట్రప్రభుత్వం తీసుకోనుంది. ఇదిలావుంటే బుధవారం ఆర్డీవో నిశాంత్ రెడ్డి ఇరువర్గాలను పిలిచి విచారణ చేపట్టారు. బాధితుడు కె.పురుషోత్తమ రెడ్డితో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ద్రాక్షాయణి భర్త చిరంజీవుల రెడ్డి, వైసీపీ జడ్పీటీసీ డిల్లీరాణి హాజరయ్యారు. అయితే 1959 నుంచి పురుషోత్తం రెడ్డి దగ్గర ఉన్న డాక్యుమెంట్లను ఆర్డీవోకు సమర్పించగా, చిరంజీవుల రెడ్డి, డిల్లీరాణి ఆర్డీవో అడిగిన డాక్యుమెంట్లు సమర్పించలేకపోయినట్టు తెలిసింది.

నేడు పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను గురువారం ఉదయం 6గంటలకే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అందజేయనున్నారు.జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మొత్తం 2,67,772మంది పింఛనుదారులున్నారు.5,827మంది సచివాలయ సిబ్బంది వీరికి పింఛన్లు అందజేయనున్నారు. ఇందుకోసం బుధవారం రాష్ట్ర ప్రభుత్వం రూ.113.17కోట్లు విడుదల చేసింది.

నేటినుంచి హెల్మెట్ ధరించాల్సిందే

డిమాండ్‌కు దీటుగా దొరకని బ్రాండెడ్ హెల్మెట్లు



తిరుపతి(నేరవిభాగం), జూలై 31: ద్విచక్ర వాహన చోదకులు గురువారం నుంచి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాల్సిందే. జిల్లా వ్యాప్తంగా ఈ నిర్ణయం అమలుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే విస్తృత అవగాహన కల్పించింది. మరోపక్క ఆటోమొబైల్ షాపులు, వాహన మెకానిక్‌లు హెల్మెట్లు విక్రయాలు చేపట్టారు. అయితే తిరుపతిలో డిమాండ్‌కు తగ్గట్టు కంపెనీ బ్రాండెడ్ హెల్మెట్లు లేకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడు వాహనాలు నడుపుతూ ఫోన్‌లో మాట్లాడే వారి సంఖ్య పెరిగింది. దీంతో ఆధునిక హెల్మెట్లపై జనం ఆసక్తి చూపుతున్నారు హెల్మెట్‌లోనే బ్లూటూత్, లైటింగ్ సిస్టమ్ ఉన్న హెల్మెట్లు వచ్చాయి. వీటి ధర కనీసం రూ.2500 వరకు ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఎక్కువ బరువు ఉన్నవి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. బ్రాండెడ్ కంపెనీల హెల్మెట్‌లకు ఎక్కువగా డిమాండ్ ఉంది. పాత తిరుచానూరు రోడ్డులోని కొన్ని షోరూముల్లో సాధారణ హెల్మెట్ రూ.1000 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. తిరుపతిలో దాదాపు 1.80 లక్షల హెల్మెట్లు అవసరముందని అంచనా. వారం పది రోజుల్లో కంపెనీ హెల్మెట్లు తెప్పిస్తామని షోరూం యజమానులు చెబుతున్నారు.

తిరుచానూరు పెద్దచెరువుకు గండి

- వీవీ నగర్ అపార్టుమెంట్లలోకి నీళ్లు
- కన్నెత్తి చూడని ఇరిగేషన్, తుడా
- గండి ఆక్రమణదారుల పనే అని స్థానికుల్లో అనుమానాలు



పెద్ద చెరువుకు పడిన గండి

తిరుచానూరు, జూలై 31 : తిరుచానూరు పెద్ద చెరువుకు గండిపడింది. దీంతో చెరువులో నీళ్లు తిరుచానూరులోని వీవీనగర్ ఇళ్లలోకి, అపార్ట్‌మెంటుల్లోకి చేరడంతో కాలనీవాసులు ఆందోళనపడ్డారు. అటు పద్మావతి పురం నుంచి ఇటు తిరుచానూరులోని వీవీ నగర్ వరకు విస్తరించి వున్న ఈ చెరువులో కొంతభాగాన్ని శిల్పారామానికి, గ్రాండ్ రిడ్జ్ హోటల్‌కు, మరి కొంత భాగాన్ని మహిళా ప్రాంగణానికి, ఐటీఐకి గతంలో కేటాయించారు. సుమారు 17 ఎకరాల వరకూ పర్యాటక అభివృద్ధి పేరుతో వైసీపీ ప్రభుత్వం తుడాకు అప్పగించింది. అమ్యూజ్‌మెంట్ పార్కు పేరుతో ఓ ప్రైవేటు సంస్థకు తుడా లీజుకు ఇచ్చింది. అయితే ఆ సంస్థ చెరువులో నీరున్న ప్రాంతాన్ని చదును చేసి వదిలేసింది. అటు పద్మావతిపురం, శ్రీనివాసపురం, నగరంలో కొన్ని ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు, వర్షపు నీరు చెరువులోకి చేరుతుంది. ఈ క్రమంలో పద్మావతిపురం శివారులో గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు చెరువును కబ్జా చేశారు. మిగిలిన భాగాన్ని కూడా కబ్జా చేయాలనే మంగళవారం రాత్రి చెరువుకు గండి కొట్టినట్లు ప్రచారం జరుగుతోంది.దీంతో చెరువులోని నీరు తిరుచానూరులోని వీవీనగర్‌ను ముంచెత్తింది. ఇళ్లలోకి, అపార్ట్‌మెంటుల్లోకి నీళ్లు చేరడంతో కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు.తాగునీటి సంపుల్లోకి ఈ బురద నీరు చొచ్చుకెళ్లింది.స్థానికులు బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు. ఇరిగేషన్, తుడా అధికారులకు సమాచారం అందించినా వారు స్పందించలేదని స్థానికులు మండిపడుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌రాజు తన బృందంతో బుధవారం ఉదయం ఎక్స్‌కవేటర్ సాయంతో గండిని పూడ్చివేశారు.అయితే నడవడానికి రోడ్లన్నీ బురదగా మారడంతో జనం ఇబ్బంది పడ్డారు.తాగునీటి కోసం అల్లాడిపోయారు. గతంలో కూడా కల్వర్టు తొలగించి నీటిని కాలనీ వైపు మళ్లించినట్లు వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఇరిగేషన్, తుడా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఈ చెరువు కట్టమీదనే రేణిగుంట రోడ్డు నుంచి పద్మావతి పురం శ్మశానం మీదుగా తిరుచానూరు ఫ్లైఓవర్ వరకు మాస్టర్‌ప్లాన్ రోడ్డు వస్తోంది.



గండిని పూడుస్తున్న పంచాయతీ సిబ్బంది



వీవీ నగర్ అపార్టుమెంట్లలోకి నీళ్లు

రోడ్డు నిర్మాణంలో భాగంగా కల్వర్టు ఏర్పాటు చేశారు. అయితే కల్వర్టుకు ఎలాంటి గేటు ఏర్పాట్లు చేయకపోవడంతో చెరువులోని నీటిని కొంతమంది గండికొట్టి కాలనీ వైపు మళ్లిస్తున్నారు.అసలు ఎవరు గండికొడుతున్నారో అనే విషయంపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. చెరువులో నీరుంటే తాము కబ్జా చేసిన స్థలాల్లోకి నీళ్లొస్తాయని గండి కొడుతున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ చెరువు నుంచి దిగువ ఉన్న నందిగుంట, దామినేడు చెరువుకు నీరు వెళ్లే కాలువలను కబ్జా చేయడంతో ఆ నీటి ప్రవాహం కూడా వీవీనగర్, కొత్తకాలనీ లేఅవుట్లకు వెళుతోంది. ఒకవేళ భారీ వర్షాలు వచ్చి చెరువు నిండితే అపుడు కూడా ఇలాగే కల్వర్టుకు ఉన్న మట్టిని తొలగిస్తే తమ పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సీఎం సమీక్షకు నివేదికలు సిద్ధం చేయండి

- కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31: జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో ఆయన సమీక్షిస్తూ... ఆగస్టు మొదటి వారంలో ముఖ్యమంత్రి కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్, పర్యాటక శాఖ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ తదితర శాఖలపై సమీక్షించారు. పవర్ ప్రెజంటేషన్ సిద్ధం చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పలువురు డీఎస్పీల బదిలీ



జి.శ్రీనివాస రావు



సూర్యనారాయణ రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), జూలై 31 : పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. చంద్రగిరి సమీపంలోని కల్యాణి డ్యాం వద్ద వున్న పోలీసు ట్రైనింగ్ కళాశాల డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావును నెల్లూరు రూరల్ డీఎస్పీగా బదిలీ చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ బి. ఉమామహేశ్వరరావును,గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు.తిరుపతి డీఎస్పీ రవిమనోహరాచారిని సీఐడీ విభాగానికి బదిలీ చేశారు.తిరుపతి రైల్వే విభాగ డీఎస్పీగా పనిచేసిన షాను షేక్‌ను పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు.తిరుమల డీఎస్పీ శ్రీనివాసాచారిని కర్నూలు దిశ డీఎస్పీగా బదిలీ చేశారు. గతంలో తిరుచానూరు, గంగవరం, తిరుపతి స్పెషల్ బ్రాంచిలో పనిచేసి ప్రస్తుతం నెల్లూరు క్రైం విభాగంలో వున్న రామకృష్ణమాచారిని తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీగా నియమించారు.రెండు రోజుల్లో మరోసారి భారీఎత్తున జరగనున్న డీఎస్పీల బదిలీల్లో జిల్లానుంచి మరో ఐదుగురు బదిలీ కానున్నారు. తిరుపతి డీఎస్పీగా కాకినాడ సెబ్‌లో పనిచేస్తున్న వెంకట నారాయణను నియమించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.





శ్రీకాళహస్తిలో బుధవారం సత్య ఏజన్సీస్ 26వ బ్రాంచిని అధినేత స్వరూప్ మురారి ప్రారంభించారు.ఏపీ హెడ్ సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తాం: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గూడూరు, జూలై 31: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేలా సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా రూ.3వేల పెన్షన్‌ను రూ.1000 పెంచి రూ. 4వేలను లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందిస్తున్నారన్నారు. ఈనెల 1న గురువారం ఉదయం 6గంటల నుంచే పింఛను పంపిణీ చేస్తారన్నారు. ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం జరుగుతోందని త్వరలోనే కార్యరూపం దాలుస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలో సిలికా, ఇసుక మైనింగ్‌లో జరిగిన అక్రమాలపై అధికారుల విచారణ జరుగుతోందని, త్వరలోనే నిజాలను నిగ్గుతేలుస్తామన్నారు. భాస్కర్‌రెడ్డి, చాన్ బాషా, చెంచురామయ్య, శివకుమార్, వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వరు నాయుడు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువల అభివృద్ధికి చర్యలు



నాయుడుకాలువ పరిశీలనలో అధికారులు

గూడూరు, జూలై 31: పట్టణంలో మురుగునీరు సక్రమంగా పారేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వీధుల్లో కాలువలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వర్షపునీరు సజావుగా ప్రవహించేలా ప్రధాన కాలువల్లో పూడికతీతకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. పలు వార్డుల్లో దుస్థితికి చేరిన కాలువలను గుర్తించి వాటికి మరమ్మతులు చేపడుతామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీరు, వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తామన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



జనసేన ఆధ్వర్యంలో ఎంఈవోకు వినతిపత్రం

గూడూరు, జూలై 31: పట్టణంలోని చవటపాళెం ప్రభుత్వ ఉన్న పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని జనసేన నాయకులు ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో కాంచనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ... తాగునీటి సమస్య కారణంగా మధ్యాహ్నం భోజనం సక్రమంగా చేయడం లేదన్నారు. ఇంద్రవర్ధన్, చంద్రనీల్, రాజశేఖర్, విష్ణు, ప్రసాద్, అవినాష్, కోటి, మురళి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు వెళ్లేలా చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, జూలై 31: స్థానిక శ్రామికనగర్‌లో మురుగునీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జరిగి ధర్నాలో వారు మాట్లాడుతూ... శ్రామికనగర్‌లో మురుగు నీరు బయటకు వెళ్లే ప్రాంతంలో ఓ ప్రైవేటు కళాశాల నిర్వాహకులు గోడను నిర్మించారన్నారు. దీంతో మురుగు ముందుకు కదలక నిల్వచేరడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. శివకుమార్, శ్రీనివాసులు, బీవీరమణయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల క్రితం నిర్మించాం

కళాశాలలో విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా కొందరు వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నట్టు కలశాల యాజమాన్యం ప్రకటించింది. కళాశాలలో 8 ఏళ్ల క్రితమే ప్రహరీ నిర్మించినట్టు పేర్కొంది. అయితే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గోడను ధ్వంసం చేయడం కారణంగా మురుగునీరు కళాశాల ఆవరణలోకి వస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

డీఎస్పీ బదిలీ



సూర్యనారాయణరెడ్డి

గూడూరు అర్బన్, జూలై 31: గూడూరు డీఎస్పీగా పనిచేస్తున్న సూర్యనారాయణరెడ్డిని బుధవారం బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేశారు. ఈ క్రమంలో గూడూరు డీఎస్పీగా పని చేస్తున్న సూర్యనారాయణరెడ్డిని విజయవాడ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల సమయంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అప్పట్లో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఎన్నికల అధికారులు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

నేడు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

గూడూరు అర్బన్, జూలై 31: స్థానిక త్యాగరాజవీధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం సునీత సేవా సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపండి



ఎస్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, జూలై 31: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌ఐ గోపీకి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. గంజాయి పై ఉక్కుపాదం మోపడంతోపాటు పాఠశాలలు, కళాశాలల వద్ద ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వినయ్‌కుమార్, గణేష్, మనోజ్, పవన్, శివకుమార్, ముఖేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని దినాలు పెంచండి

తడ, జూలై 31: ఉపాధి హామీ పని దినాలను నిర్ణయించిన లక్ష్యం ప్రకారం పూర్తి చేసేందుకు అందరూ కృషి చేయాలని ఎంపీడీవో విజయ్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూలీలకు కనీస వేతనం రూ.300 అందేలా పనులు చేయించాలన్నారు. అలాగే బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని ఆయన ఆదేశించారు. ఏపీవో విజయభాస్కర్ పాల్గొన్నారు.

తిరుమలలో సచివాలయానికి భూమిపూజ

తిరుమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల స్థానికులు నివాసముండే బాలాజీనగర్‌లో సచివాలయ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం భూమిపూజ చేశారు. ప్రస్తుతం తిరుమలలోని డీటైప్ క్వార్టర్స్‌లో తాత్కాలికంగా సచివాలయం ఉన్న విషయం తెలిసిందే. బుధవారం కూటమి నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్‌తో కలిసి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుమల, తిరుపతి స్థానికులకు సంబంధించిన 19 సమస్యలపై టీటీడీ ఈవోతో చర్చించామన్నారు. ఇక టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరిని బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన నేతలు రాజారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అక్రమ లేఅవుట్ల తొలగింపునకు చర్యలు

- రూ.11 కోట్లతో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి
- పైప్‌లైను ఆధునికీకరణకు రూ.93 కోట్ల మంజూరు
- త్వరలో రోడ్ల విస్తరణ
- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే కురుగొండ్ల



ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 31: పట్టణంలో అసంపూర్తిగా వున్న టిడ్కో ఇళ్ల పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాం లో అసంపూర్తిగా వదిలేసిన టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయిస్తామన్నారు. ఇంకా పట్టణంలో అస్తవ్యస్తంగా వున్న తాగునీటి పైప్‌లైన్లను రూ.93 కోట్లతో మరమ్మతులు చేపడుతామన్నారు. సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు సమస్యలు ఏకరవు పెట్టడం చూస్తుంటే గత మూడేళ్లల్లో పాలకవర్గం ఏవిధంగా పని చేసిందో అర్థమవుతోందన్నారు. పైప్‌లైన్ల మరమ్మతులు ఒకే కాంట్రాక్టర్‌కు ఇవ్వడంపై కురుగొండ్ల మండి పడ్డారు. గత సీఎం జగన్ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి వెళ్లాడని నిధుల కొరత కారణంగా అభివృద్ధి పనులను విడతల వారీగా పూర్తి చేస్తామన్నారు. పోలేరమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. సమావేశానికి వైసీపీ కౌన్సిలర్లు ముగ్గురు డుమ్మాకొట్టారు. అంతకు ముందు తొలిసారిగా మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భానుప్రియ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి: విజయశ్రీ

ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ప్రమాణం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 31: అందరి సహకారంతో సూళ్లూరుపేట పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం స్త్రీ స్వశక్తి భవనంలో మున్సిపల్ చైర్మన్ డి.శ్రీమంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఎక్స్ అఫిషియో సభుర్యాలిగా ప్రమాణం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కౌన్సిలర్లు గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో రోడ్లు దుస్థితికి చేరుకున్నాయన్నారు. మురుగునీటి కాలువలదీ అదే పరిస్థితి అన్నారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో తాము ఎన్నిసార్లు సమస్యలను విన్నవించినా పట్టించు కోలేదన్నారు. తొలిసారిగా కౌన్సిల్ సమావేశానికి విచ్చేసిన విజయశ్రీని మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంపై రూ.45 లక్షలతో నిర్మించిన అదనపు భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, బీసీ సెల్ నాయకులు చిట్టేటి పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్



కార్యక్రమంలో షార్ డైరెక్టర్, కళాశాల యాజమాన్యం

సూళ్లూరుపేట, జూలై 31: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో బాగా పట్టుసాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు స్పేస్ డే సంబరాలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇస్రో, షార్ సంయుక్తంగా శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఇందులో భాగంగా బుధవారం తమిళనాడు తిరువళ్లూరులోని ప్రత్యూష ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ దేశాల్లో భారత్‌ను అంతరిక్ష రంగలంలో శక్తివంతంగా నిలపడమే లక్ష్యంగా ఇస్రో శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఇప్పటి నుంచే పట్టుదలతో చదవితే శాస్త్రవ్తేలుగా ఎదగ వచ్చన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పేస్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఇస్రో ప్రయోగించే రాకెట్లు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాలు తదితర వాటి పై అవగాహన కల్పించారు.

ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత సంజీవయ్యకు లేదు

మాజీ ఎంపీ నెలవల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల

సూళ్లూరుపేట, జూలై 31: టీడీపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు లేదని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే విజయశ్రీ క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులతో కలసి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పట్టుమని రెండు నెలలు కూడా పూర్తి కాకుండానే హామీలు నెరవేర్చలేదు.. దౌర్జన్యాలు, దాడులు చేస్తున్నారని కిలివేటి విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెండు పర్యాలు ఎమ్మెల్యేగా ఉన్న ఆయన, వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేశారో ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే తెలుస్తుందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఇంటి వద్దకే ఫించన్ల పంపిణీ చేస్తుంటే ప్రభుత్వ పథకాలు పేదలకు అందడం లేదనడం భావ్యం కాదన్నారు. ఇక రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని వైసీపీ అధినేత జగన్ ఢిల్లీ వీధుల్లో ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజలు దిమ్మతిరిగే తీర్పు ఇచ్చినా వైసీపీ తాను చేసిన పాపాలను తెలుసుకోకుండా మంచి చేసే ప్రభుత్వంపై నిందలు వేయడం మంచి పద్ధతి కాదన్నారు. పేదలకు రూ.5కే అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు కూడా మూసేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఇలా అసత్య ఆరోపణలు మానుకోకపోతే ప్రజాక్షేత్రంలో కూడా తిరగలేరని కిలివేటిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి.సుధాకర్ రెడ్డి, ఏ.రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, రఫి, చిట్టేటి పెరుమాల్, బొమ్మన పళణి తదితరుల పాల్గొన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ సీజ్



మున్సిపల్ కమిషనర్ సీజ్‌చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్

సూళ్లూరుపేట, జూలై 31: పట్టణంలో అల్ షీరిస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను బుధవారం రాత్రి మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ సీజ్ చేశారు. 10 రోజుల క్రితం ఆర్డీవో చంద్రముని అధికారులతో కలిసి పట్టణంలో హోటళ్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు చేపట్టి నిల్వ పదార్థాలు, అపరిశుభ్రంగా వాతావరణం ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. జీఎన్‌టీ రోడ్డులో ఆర్‌ఆర్ సూపర్ మార్కెట్ పక్కనే అల్ షీరిస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో నిల్వ మాంసం వినియో గిస్తున్నారని పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ మున్సిపాలిటీ సిబ్బందితో అక్కడికి వెళ్లి తనిఖీ చేశారు. నిబంధనల మేరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ లేకపోవడంతో సీజ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలకు చిత్రపటాల వితరణ



వెలుగు కార్యాలయానికి పీఎం, సీఎం చిత్రపటాలను అందిస్తున్న నేతలు

కోట, జూలై 31: పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు బుధవారం టీడీపీ, జనసేన నాయకులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలను అందజేశారు. వెలుగు కార్యాలయంలో ఏపీఎం రత్నయ్యకు మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది రోహిత్‌కు ఆయా చిత్రపటాలను టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ టి.కోటేశ్వరరావు, జనసేన నేతలు అల్లం బాబు, వెంకటేశ్వర్లు అందజేశారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి అభయం



తిరుచానూరు, జూలై 31: రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామికి తిరుచానూరులో బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం రోహిణిని పురస్కరించుకుని ఉత్సవర్లకు నేత్రపర్వంగా అర్చకులు అభిషేకం నిర్వహించారు. సర్వాలంకార శోభితులైన రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్లు మధు, చంద్రశేఖర్, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


దిచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి

గూడూరు, జూలై 31: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు చేపడుతామని రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జాతీయరహదారి పోటుపాళెం కూడలి వద్ద ద్విచక్రవాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో హెల్మెట్ లేకపోతే తీవ్రగాయాలపాలవడంతోపాటు మృతిచెందే అవకాశం ఉంటుందన్నారు. నిబంధనలకు లోబడి వాహనాలను నడపాలన్నారు. ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి



దొడ్లవారి మిట్ట గిరిజన కాలనీలో జరిగిన సమావేశం

కోట, జూలై 31 : ప్రతి ఒక్కరు ప్రస్తుత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అధికారులు కోరారు. మండలంలోని గూడలిలో బుధవారం పౌరహక్కుల దినం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం కొత్తకొత్త చట్టాలు వస్తున్నాయన్నారు. ఆయా చట్టాలపై ప్రధానంగా గిరిజనులు అవగాహన పెంచుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ సందర్భంగా ఆయా చట్టాల ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: పౌర హక్కుల దినం సందర్భంగా మండలంలోని దొడ్లవారి మిట్ట గిరిజన కాలనీలో హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కేవీఆర్వీ ప్రసాదరావు మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వీఆర్వో వంశీకృష్ణ, వెలుగు ఏపీఎం మునిరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు రేపు తొలిసారిగా డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై నేరుగా టీటీడీ ఈవోతో మాట్లాడవచ్చు. దీనికోసం భక్తులు 0877 2263261 నెంబరును సంప్రదించాల్సి ఉంటుంది.

గ్రామాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

యుద్ధప్రాతిపదికన స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఓజిలి, జూలై 31: మండలంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌కో అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఓజిలితో పాటు కురుగొండ, ఆరిమేనిపాడు, కరబల్లవోలు, వజ్జావారిపాళెం విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని 12 విద్యుత్ ఫీడర్ల పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరాకు నిర్దేశించిన త్రీ ఫేస్ లైనుకు సమాంతరంగా ఆయా గ్రామాల పరిధిలో స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. త్రీ ఫేస్ లైనుకు సరిపోయే విధంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఆయా గ్రామాల పరిధిలో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి 100 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఓజిలి, కురుగొండ, ఆరిమేనిపాడు, చిల్లమానుచేను గ్రామాల్లో స్తంభాల ఏర్పాటును పూర్తి చేసి లైన్ కూడా సిద్ధం చేసినట్టు ఏఈ అనీల్‌కుమార్ చెప్పారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థినికి దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

వెంకటగిరి టౌన్, జూలై 31: మండలంలోని వల్లివేడు వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సింహపురి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమన్ మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిరోజు దంతాల ను పరిశుభ్రం చేసుకున్న తరువాతే ఆహారం తీసుకోవాలన్నారు. మిఠాయిలు, స్వీట్లు తిన్నతరువాత నోటిని శుభ్రం చేసుకోవాలన్నారు. ఎల్‌వీప్రసాద్ కంటి వైద్య ఆసుపత్రి వైద్యురాలు కావ్య మాట్లాడుతూ... కన్ను చాలా ప్రధానమైందన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు తినడం ద్వారా కళ్లు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. జి.ఉదయ్‌కుమార్, ప్రవీణ్, విష్ణువర్ధన్, సాయినికేష్, సాయిచరణ్, లీలా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఎస్.ఆర్ నాయుడు

వెంకటగిరి టౌన్, జూలై 31: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏలాంటి అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవని వెంకటగిరి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధులు తీసుకువచ్చి వెంకటగిరిని అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఎస్ కెనాల్, ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను పూర్తి చేస్తామన్నారు.గోషా ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా చేస్తామన్నారు. కార్యక్రమంలో బాల కృష్ణ, యోగేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి- బెంగళూరు బస్సు సర్వీసు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 31: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం వెంకటగిరి డిపోలో వెంకటగిరి - బెంగళూరు అద్దె బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందన్నారు. సర్వీసులను తగ్గించడమే కాకుండా బస్టాండ్లు, డిపోలను అమ్మకానికి పెట్టిందన్నారు. త్వరలో చెన్నైకు రెండు బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. వెంకటగిరి నుంచి నెల్లూరు, తిరుపతి, నాయుడుపేట మార్గాల్లో కూడా సర్వీసులు పెంచుతామన్నారు. ఆర్టీసీ డీఎం రామకృష్ణ, సిబ్బంది, ఆర్టీసీ యూనియన్ నాయకులు కె.వి.రత్నం, వై.వి. ప్రసాద్, ఆర్. కృష్ణయ్య, పూర్ణారావు, సుబ్బారావు తదితరులు ఎమ్మెల్యేని పూలమాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాందాస్ గంగాధర్, పునుగోటి విశ్వనాథనాయుడు, కే.వి.కే ప్రసాద్ నాయుడు, మల్లారం బాబు, కాపా శ్రీనివాసులు నాయుడు, చంగారావు, జీకేపల్లి బాబు, తోటా రామచంద్రయ్య, జానపాటి బాలకృష్ణ, పచ్చూరు నరసయ్య నాయుడు, జనసేన నాయకులు జి.వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నంపై పోక్సో కేసు

చిల్లకూరు, జూలై 31: చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటనకు సంబంధించి చిల్లకూరు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించి బుధవారం డీఎస్పీ సూర్యనా రా యణ రెడ్డి విచారణ చేపట్టారు. ఆయన వెంట ఎస్‌ఐ సుధీర్‌కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీ క్యాంప్

కోట, జూలై 31: మండల పరిధిలోని గూడలిలో బుధవారం స్త్రీనిధి రుణాల రికవరీ క్యాంప్ జరిగింది. స్త్రీనిధి మేనేజర్ జయకుమార్, సీసీ శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో గూడలి, దక్షిణపాలెం, రాజుపాళెం, కొండమిట్ట, ప్రకాష్‌కాలనీలలో స్త్రీనిధి రుణాల రికవరీని ఆయా అధికారులు ప్రారంభించారు. మలివిడత రుణాలు పొందెందుకు ఆయాగ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. 2024-25కి స్త్రీనిధి రుణాలు పొందెందుకు అర్హులైన సంఘాల జాబితాపై కసరత్తు ప్రారంభించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.48 కోట్లు

తిరుమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.48 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 65,874 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఇక 23,782 మంది తలనీలాలు సమర్పించారు.